చారిత్రక ఆనవాళ్లు సైతం కబ్జాలు

-200 ఏళ్ల చింతబాయి కబ్జాకు ప్రయత్నాలు -హైడ్రా ప్రజావాణికి 32 ఫిర్యాదులు


పిర్యాదు దారులతో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ ఆర్.సుదర్శన్

హైదరాబాద్,జనవరి 5,ప్రభాతవార్త: చెరువులే కాదు.. ఊట బావులను కూడా వదలడం లేదు. గతంలో వందలు, వేలాదిమందికి తాగునీరందించిన ఓపెన్ బావులను నేటి ప్రభుద్ధులు పూడ్చేసి ప్లాట్లుగా చేసి విక్రయించేస్తున్నారు. నగరంలో ఇలా అనేక ఓపెన్ బావులు కనుమరుగవ్వగా.. తాజాగా అల్వాల్‌లో సజీవంగా ఉన్న దానిపై కబ్జారాయుళ్ల కన్ను పడింది. 200 ఏళ్ల ఓపెన్ బావిని కాపాడి.. చారిత్రక ఆనవాళ్లను పరిరక్షించాలంటూ వెన్‌రాక్ ఎన్‌క్లేవ్ నివాసితులు హైడ్రా ప్రజావాణికి వచ్చి విన్నవించారు. పార్కులు, రహదారులు ఇలా అనేకం ఆక్రమణలై శాశ్వత భవనాలు వచ్చేయగా.. హైడ్రా వచ్చిన తర్వాత చాలా పార్కులకు ప్రాణం పోసారంటూ పలువురు అభినందిస్తున్నారు. తమ పార్కులను కూడా కాపాడి ప్రాణవాయువు అందించాలని వినతిపత్రాలు అందజేస్తున్నారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి 32 ఫిర్యాదులు అందాయి. వీటిని హైడ్రా అడిషనల్ కమిషనర్ ఆర్. సుదర్శన్ పరిశీలించి.. సంబంధిత అధికారులకు పరిష్కార బాధ్యతలు అప్పగించారు.

ఫిర్యాదులు ఇలా..

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అల్వాల్ లోని వెన్‌రాగ్ ఎన్‌క్లేవ్‌లో చారిత్రక ఊటబావిని కొంత మంది కబ్జా చేయడానికి ప్రయతిస్తున్నారని అక్కడి నివాసితులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 200 ఏళ్ల చరిత్ర ఉన్న చింతబాయి ఓపెన్ బావి ఎంతో మందికి తగునీరందించిందని.. దానిని కాపాడాలని కోరారు.వెన్‌రాగ్ ఎన్‌క్లేవ్ లే ఔట్ వేసినప్పుడు ఓపెన్ స్పేస్‌గా చూపించారని పేర్కొన్నారు. ఇప్పుడదే కబ్జా అవుతోందని దానిని కాపాడాలని వనతిపత్రం అందజేశారు. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం ఆర్‌కే పురం డివిజన్‌లోని గ్రీన్‌హిల్స్ కాలనీలో 6087 గజాల ఓపెన్‌స్పేస్ వదిలిపెట్టారు. ఇప్పటికే కొంత స్థలం కబ్జాకు గురయ్యిందని.. వెంటనే సర్వే జరిపించి రికార్డుల ప్రకారం ఉన్న భూమిని కాపాడి..మా కాలనీకి మంచి పార్కును నిర్మించాలని అక్కడి నివాసితులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నిజాంపేట సర్కిల్ పరిధిలోని చిల్డ్రెన్ పార్కు దగ్గరలోని మురుగునీరు, వరదనీటి కాలువను ఇష్టానుసారం మార్చేస్తున్నారని.. గతంలో ఎలా ప్రవహించేదో అలాగే ఉంచాలని కౌశల్యా కాలనీ వాసులు వినతి పత్రం సమర్పించారు. వారి రియల్ ఎస్టేట్ సామ్రాజ్యాలకు అనువుగా కాలువను తిప్పి వరద సాఫీగా సాగేందుకు అవకాశం లేకుండా మారుస్తున్నారని.. వెంటనే కలుగ చేసుకుని గతంలో మాదిరి వరద సాగేలా చూడాలని కోరారు. ఐటీ హబ్‌కు చేరువలో అత్యంత విలువైన ఖాజాగూడలో ఉన్న ఖాజాగూడ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని వెయ్యి గజాల వరకూ కబ్జాచేసేశారని హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదు చేశారు. దీనిని 250 గజాల చొప్పున 4 ప్లాట్లుగా చేసి ఇంటి నంబర్లు కూడా తెచ్చుకున్నారని హైడ్రా రంగంలోకి దిగి ఖాజాగూడ పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని రక్షించాలని కోరారు.

చైనీస్ మాంజాపై ఉక్కుపాదం : సిపి సజ్జనార్

హైదరాబాద్, జనవరి 5 ప్రభాతవార్త

సంక్రాంతి పండుగ వేళ నిషేధిత చైనీస్ మాంజా విక్రయాలు, వాడకంపై కఠినంగా వ్యవహరిస్తున్నట్లు నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్ తెలిపారు. పక్షుల స్వేచ్ఛకు, అమాయక వాహనదారుల ప్రాణాలకు ముప్పుగా పరిణమిస్తున్న ఈ ప్రమాదకరమైన మాంజాను ఎవరైనా రహస్యంగా విక్రయించినా, నిల్వ ఉంచినా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చైనీస్ మాంజా నియంత్రణ, తీసుకోవాల్సిన చర్యలపై క్షేత్రస్థాయి అధికారులకు సీపీ సజ్జనర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పండుగ పూట గాలిపటాలు ఎగురవేయడం సంప్రదాయమే అయినప్పటికీ, అది ఇతరుల ప్రాణాలకు ముప్పుగా మారకూడదని హితవు పలికారు. చైనీస్ మాంజా పర్యావరణానికి తీవ్ర హాని కలిగిస్తోందని, ఇది మట్టిలో కలిసిపోక ఏళ్ల తరబడి అలాగే ఉండిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణ చట్టం1986 ప్రకారం ప్రభుత్వం చైనీస్ మాంజా తయారీ, విక్రయం, నిల్వ, వినియోగంపై పూర్తిస్థాయి నిషేధం విధించిందని గుర్తుచేశారు. ఈ నిషేధాన్ని కఠినంగా అమలు చేసేందుకు నగరవ్యాప్తంగా ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు సీపీ వెల్లడించారు. నగరంలోని అన్ని జోన్లలోని కైట్స్ విక్రయ కేంద్రాలు, చిన్న కిరాణా దుకాణాలు, అనుమానిత గోదాములపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా ఆకస్మిక దాడులు నిర్వహిస్తారని స్పష్టం చేశారు. కేవలం విక్రయదారులే కాకుండా, ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి అక్రమంగా ఈ నిషేధిత మాంజాను రవాణా చేస్తున్న ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలు, పార్శిల్ సర్వీసులపైనా నిఘా పెంచామని, వారి ప్రమేయం ఉన్నట్లు తేలితే ఏజెన్సీ యజమానులపైనా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని సీపీ సజ్జనర్ విజ్ఞప్తి చేశారు. చైనీస్ మాంజాలో ప్లాస్టిక్, ఇతర సింథటిక్ పదార్థాలతో పాటు గాజు పెంకుల మిశ్రమం పూతగా ఉంటుందని, దీనివల్ల ద్విచక్ర వాహనదారుల మెడలు తెగిపోవడంతో పాటు, పిల్లల వేళ్లు తెగిపోయే ప్రమాదం ఉందని వివరించారు. అంతేకాకుండా, ఇందులో ఉండే మెటాలిక్ పదార్థాల వల్ల విద్యుత్ తీగలకు తగిలినప్పుడు షాక్ కొట్టి పిల్లలు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. దయచేసి తల్లిదండ్రులు తమ పిల్లలకు సంప్రదాయ నూలు దారాలను మాత్రమే ఇచ్చి ప్రోత్సహించాలని కోరారు. నగర పౌరులు కూడా సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని సీపీ పిలుపునిచ్చారు. మీ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా గుట్టుచప్పుడు కాకుండా నిషేధిత చైనీస్ మాంజా విక్రయిస్తున్నట్లు లేదా నిల్వ చేసినట్లు గమనిస్తే వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి గానీ, హైదరాబాద్ పోలీస్ వాట్సాప్ నెంబర్ +91 94906 16555 గానీ లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

కాలుష్యం చిమ్ముతున్న పరిశ్రమలు

-శివారు ప్రాంతాలలో పరిశ్రమల ఇష్టారాజ్యం
-పట్టించుకోని పిసిబి అధికారులు
-అనారోగ్యం పాలవుతున్న స్థానికులు

హైదరాబాద్, జనవరి 5 ప్రభాతవార్తః

దేశాభివృద్ధిలో భాగం పంచుకునే పరిశ్రమలు యజమానులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాలుష్యానికి కాసారాలుగా మారుతున్నాయి. ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించాల్సిన పరిశ్రమలు స్వప్రయోజనాల కోసం వాతావరణ కాలుష్య కారకాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ శివారు ప్రాంతాలు ఇక్కడి పరిశ్రమల కారణంగా ఇక్కడి పరిసర ప్రాంతాలు పర్యావరణ పరంగా నష్టాన్ని చవిచూస్తున్నాయి. ఇక్కడి పరిశ్రమల కారణంగా స్థానికంగా నివసించే వారు కూడా తీవ్ర అనారోగ్యంపాలవుతున్నారు. నానాటికి రోగాలబారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. పరిశ్రమల నుంచి విడుదలయ్యే వ్యర్థాల కారంణంగా సమీపంలోని నీరు, గాలి, భూమి కాలుష్యమయమవుతున్నాయి. పరిశ్రమల పరిసరాల్లో నివాసం ఉండే ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు అందుతున్నప్పటికి పీసీబీ (కాలుష్య నియంత్రణ మండలి) వారు పెద్దగా పట్టించుకున్నట్లు కనిపించడం లేదని ఇక్కడి ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులకు అందే మూటలు తప్ప మా ఆరోగ్యంపై వారికి ఎలాంటి శ్రద్ధ లేదని గట్టిగానే విమర్శిస్తున్నారు.

అనారోగ్యం పాలవుతున్న పరిశ్రమల పరిసర ప్రాంత ప్రజలు...

ఉప్పల్ సమీపంలోని నాచారం, చర్లపల్లి, మల్లాపూర్‌లతో పాటు పటాన్‌చేరు, సనత్‌నగర్, కాజీపూర్, కిష్టాయిపల్లి, బాచుపల్లి, అమీన్‌పూర్, రామచంద్రపూరం, పటాన్‌చేరు, నిజాంపేట్ లాంటి ప్రాంతాల్లో ఉన్న పరిశ్రములు కాలుష్య కారకాలవుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో పరిశ్రములు ఉన్నాయి. ఇందులోనే అనేక రెడ్ కేటగిరి పరిశ్రమలు కూడా ఉండడం గమనార్హం. వీటిని సెంట్రల్ కంట్రోల్ బోర్డు స్వయంగానే గుర్తించింది. వీటికి సమీపంలోనే ఉన్న చేరువులలో ద్రావణాలు, రసాయణ అవశేషాలు, లోహాలు అధిక మోతాదులో ఉన్నట్లు గుర్తించారు. ముఖ్యంగా సుల్తాన్‌పూర్, నక్కవాగు, అమీన్‌పూర్ తదితర చెరువులలోకి ఇక్కడి పరిశ్రమల నుంచి రాత్రిపూట పారిశ్రామిక వ్యర్థాలను వదులుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో స్థానికులు అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. ఊపిరి పీల్చుకోలేనంతగా ఘాటైన వాసనలు వస్తున్నాయంటున్నారు. ఇక్కడి పరిశ్రమల కారణంగా విడుదలయ్యే వ్యర్థాల ప్రభావంతో చెరువులలో ఉండే జలచరాలు మృత్యువాతపడుతున్నట్లు చెబుతున్నారు. నగరానికి చేరువలో ఉన్న పరిశ్రమల్లో కాలుష్యాన్ని తగ్గించడం, పచ్చదనంతో కూడి మెరుగైన వాతావరణాన్ని ఏర్పాటు చేయడం కోసం అప్పట్లో అధికారులు అంచనాలు వేసినప్పటికి అవి కార్యరూపం దాల్చలేదని స్థానికులు చెబుతున్నారు. పరిశ్రమలకు చేరువలో ఉన్న ప్రాంతాలలో పీఎం 2.5, పీఎం10 సల్ఫర్ యాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ లాంటి లోహాలు ఉన్నట్లు గుర్తించిన అధికారులు పరిశ్రమలపై చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. కాలుష్య వ్యర్థాలను సక్రమ పద్ధతిలో ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లకు పరిశ్రమలు తరలించాల్సి ఉంటుంది. పరిశ్రమలు ఇందుకు విరుద్ధంగా చెరువులు, వరద కాలువలతో పాటు కొన్నిసార్లు ట్యాంకర్‌ల ద్వారా మూసినదిలో పారబోస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి వ్యర్థాల కారణంగా స్థానికులు శ్వాసకోశ, చర్మ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నారు. పరిశ్రమల నుంచి వెలువడుతున్న వీపరీతమైన కాలుష్యం గాలిలో కూడా కలుస్తున్నాయి. అంతే కాకుండా కాలుష్యాన్ని చిమ్ముతున్న వాహనాలు, భవన, పరిశ్రమల నిర్మాణ వ్యర్థాలు గాలిలో ధూళి కణాలు పెరిగిపోవడానికి కారణమవుతున్నాయి. నాచారం పారిశ్రామిక ప్రాంతంలో కాలుష్యాన్ని తగ్గించడం, పచ్చదనం పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని అప్పట్లో అధికారులు స్థానికులకు హామీ ఇచ్చారని, కాని ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు చెబుతున్నారు.

కాలుష్యాన్ని నివారించని అధికారులు...

కాలుష్యానికి కారణమవుతున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాల్సి పీసీబీ అధికారులు మిన్నకుండిపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పరిశ్రమల పరిసర ప్రాంతాల ప్రజలు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు. నాచారం, బాచుపల్లి, బాలానగర్, జీడిమెట్ల, పటన్‌చెరు, పాశమైలారం లాంటి ప్రాంతాలలో ఉన్న పరిశ్రమల యజమానులు విచ్చలవిడిగా కాలుష్య వ్యర్థాలను ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండానే పరిశ్రమల ఆరు బయట పారబోస్తున్నారని చెబుతున్నారు. స్థానికులు అనారోగ్యం పాలవుతున్నా అధికారులు పట్టన ట్లుగా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. అడపా దడపా తనిఖీలు జరుపుతు న్నప్పటికి మామూళ్ల మయాలో పడి చర్యలు మాత్రం తీసుకోవడం లేదని ఇక్కడి ప్రజలు ఆరోపిస్తున్నారు.

జిహెచ్ఎంసి పనితీరు, బాధ్యతలపై పూర్తి అవగాహన ఉండాలి

-ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేసుకోవాలి
-నూతన అదనపు, జోనల్ కమిషనర్లకు ఆర్.వి.కర్ణన్ సూచన

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తదితరులు

హైదరాబాద్, జనవరి 5,ప్రభాతవార్త: జీహెచ్ఎంసీ పరిధిలోని వివిధ విభాగాల పనితీరు, వాటి బాధ్యతలపై నూతనంగా బాధ్యతలు చేపట్టిన అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు సమగ్ర అవగాహన కలిగి ఉండాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సూచించారు.ఇటీవల జీహెచ్ఎంసీని 6 జోన్ల నుంచి 12 జోన్లకు, 30 సర్కిళ్ల నుంచి 60 సర్కిళ్లుగా పునర్వ్యవస్థీకరించిన నేపథ్యంలో, నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్‌లో జీహెచ్ఎంసీ విభాగాల పనితీరుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, హెల్త్ అండ్ సానిటేషన్, రెవెన్యూ అండ్ ప్లానింగ్, అడ్మినిస్ట్రేషన్ అండ్ సపోర్ట్, అర్బన్ సర్వీసెస్ అండ్ డెవలప్‌మెంట్ విభాగాలకు చెందిన అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ల ద్వారా ఆయా విభాగాల విధులు, బాధ్యతలు, పనితీరు అంశాలను అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లకు వివరించారు. ఈసందర్భంగా అధికారులు అడిగిన సందేహాలకు సంబంధిత విభాగాధికారులు సమాధానాలు ఇచ్చారు.అనంతరం కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మాట్లాడుతూ, విభాగాల పనితీరు పై రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు నూతన అధికారులు తమ బాధ్యతలను స్పష్టతతో, సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ నెల 6వ తేదీన ఇంజనీరింగ్ ప్రాజెక్టులు, 7వ తేదీన సానిటేషన్, 8వ తేదీన టౌన్ ప్లానింగ్, 9వ తేదీన మెయింటెనెన్స్ అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జోన్ల వారిగా జీహెచ్ఎంసీ వివిధ విభాగాల పనితీరు, వాటి కోర్ విధులపై సమగ్రంగా వివరించేలా పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు సిద్ధం చేయాలని కమిషనర్ విభాగాల ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ అవగాహన కార్యక్రమాలను అధికారులు సద్వినియోగం చేసుకొని జీహెచ్ఎంసీ పనితీరుపై సమగ్ర అవగాహన పొందడంతో పాటు తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో అదనపు కమిషనర్లు సృజన ,వినయ్ కృష్ణారెడ్డి, హేమంత్ కేశవ్ పాటిల్, రఘు ప్రసాద్, పంకజ, మంగ తాయారు, సత్యనారాయణ, జోనల్ కమిషనర్లు జి. ముకుందరెడ్డి, అపూర్వ్ చౌహాన్, కె. చంద్రకళ, రాధికా గుప్తా, రవి కిరణ్, ప్రియాంక అలా, సంచిత్ గంగ్వార్, హేమంత్ బోర్కడే, సహదేవ్ రావు, చీఫ్ ఇంజనీర్లు సహదేవ్ రత్నాకర్, జ్యోతి తదితర విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఆర్జీలు పెండింగ్ పెట్టొద్దు

-ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలి
-అధికారులకు జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ఆదేశం

దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరిచందన దాసరి తదితరులు

హైదరాబాద్,జనవరి 5,ప్రభాతవార్త: ప్రజావాణి అర్జీల పరిష్కారంలో అధికారులు ముందుండాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరవన్ పలని (రెవెన్యూ), జితేందర్ రెడ్డి (స్థానిక సంస్థలు), డిఆర్ఓ వెంకటాచారిలతో కలసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఆర్జీలపై అధికారులు శాఖల వారీగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని, స్వీకరించిన దరఖాస్తుల పై ఎండార్స్మెంట్ చేసి, సంబంధిత అధికారులకు అందజేశారు. జిల్లాలో దివ్యాంగులు, వయోవృద్ధుల నుండి వాట్సాప్ ద్వారా వచ్చే పలు సమస్యల అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పరిష్కరించాలని ఆమె సూచించారు. అలాగే ప్రజాభవన్ లో నిర్వహిస్తున్న ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తుల పురోగతిపై , కలెక్టరేట్ ప్రజావాణి , వాట్సాప్ ప్రజావాణి పెండింగ్ అర్జీలపై ఆమె సమీక్షించారు, పెండింగ్ అర్జీలపై జాప్యం లేకుండా ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పరిష్కరించి, సంబంధిత వెబ్సైట్ లో అప్లోడ్ చేయాలని ఆమె సూచించారు. జిల్లాలో సీఎం ప్రజావాణి, కలెక్టర్ ప్రజావాణి అలాగే వాట్సప్ ప్రజావాణి దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించడంతో రాష్ట్ర ప్రభుత్వం గుడ్ గవర్నెన్స్ సర్టిఫికెట్ అందజేయడం జరిగిందని జిల్లా యంత్రాంగాన్ని ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. ప్రజావాణి కార్యక్రమంలో హౌసింగ్ శాఖ 221, రెవెన్యూ 73, ఇతర శాఖలు 23 కలిపి మొత్తం 317 ఆర్జీలు అందాయని కలెక్టర్ తెలిపారు. తదుపరి గురుకులం "కామన్ ఎంట్రన్స్ టెస్ట్ 2026" వాల్ పోస్టర్ ను సంబంధిత అధికారులతో కలసి కలెక్టర్ ఆవిష్కరించారు .ఈ అవకాశాన్ని అర్హతగల విద్యార్థులు సద్వినియోగం చేసుకావాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో పిడి హౌసింగ్ అశోక్ చక్రవర్తి, రెవెన్యూ డివిజనల్ అధికారులు సాయిరాం, రామకృష్ణ, సిపిఓ డాక్టర్. సురేందర్ , జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ జ్యోతి, లాఆఫీసర్ శ్రీధర్, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు కోటాజి, ఆశన్న, ఇలియస్ అహ్మద్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, కలెక్టరేట్ ఇంచార్జ్ ఏ.ఓ విజయ లక్ష్మి, జిల్లా అధికారులు, ఆర్జీదారులు,తదితరులు పాల్గొన్నారు.

గోదామాతకు పుష్పార్చన

గోదా అమ్మవారికి సమర్పించిన సారె

జూబ్లీహిల్స్, జనవరి 5, ప్రభాతవార్తః ధనర్మాస వేడుకల్లో భాగంగా శ్రీనగర్ కాలనీలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో గోదా మాత ఆలయంలోసామూహిక పుష్పార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు గోదా అమ్మవారికి సారె సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సిపిరి అర్జున్ యాదవ్, ఈవో శ్రీనివాస శర్మ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోదా అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ నెల 14న గోదాదేవి కళ్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలియజేసింది.

నడక అనేది ఆరోగ్య సంజీవిని : ఎమ్మెల్యే ముఠా గోపాల్

కార్యక్రమంలో పాల్గొన్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, వాకర్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రవి రాజు, నూతన వాకర్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఎస్. మనోహర్ రెడ్డి తదితరులు

చిక్కడపల్లి జనవరి 5, ప్రభాతవార్త : ఆరోగ్యమే మహాభాగ్యం అనేది మన పెద్దల మాట. నేటి యాంత్రిక జీవనంలో నడక అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదు, అది ఒక ఆరోగ్య సంజీవిని అని వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు డాక్టర్ పి.రవి రాజు, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్క్ లో వాల్కర్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ సెంట్రల్ నూతన అధ్యక్షుడిగా ఎస్. మనోహర్ రెడ్డి నేతృత్వంలో నూతన కార్యవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ప్రధాన కార్యదర్శిగా ఎం.దశరథ్, ఉపాధ్యక్షుడిగా వి.కళ్యాణ్ నాయక్ , జాలి వాకర్ గా జి.కృష్ణ ప్రధమాణస్వీకారం చేసిన వారిలో ఉన్నారు. సభలో డిస్ట్రిక్ట్ గవర్నర్ బి.గంగాధర్ రెడ్డి, జిహెచ్ ఎం సి డిప్యూటీ కమీషనర్ రామానుజుల రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్ కుమార్ యాదవ్, పూర్వ వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు కె.రామానందం, వి.నాగభూషణం, ఏరియా వైస్ ప్రెసిండెంట్ ఎస్. మురళి కృష్ణ, రీజినల్ చైర్మన్ శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు పూర్వ అధ్యక్షుడు పివి.నిరంజన్ రెడ్డి, 2025 జరిగిన కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో రమేష్ రెడ్డి, దామోటార్ రెడ్డి, సంపత్ రెడ్డి, ఎస్.మురళీకృష్ణ పాల్గొన్నారు.

చెత్త కుప్పలో నెలలు నిండని శిశువు మృతదేహం

బాబుల్‌రెడ్డి నగర్ చైతన్య ప్లాస్టిక్ కంపెనీ వద్ద నెలలు నిండని శిశువు మృతదేహం

మైలార్‌దేవ్‌పల్లి,జనవరి 5 ప్రభాతవార్త : మానవ సంబంధాలు రోజు,రోజుకు మంట కలిసి పోతున్నాయి.సభ్య సమాజం తల దించుకునేలా నెలల నిండని శిశువును గుర్తు తెలియని వ్యక్తులు బాబుల్‌రెడ్డి నగర్‌లోని చైతన్య ప్లాస్టిక్ కంపెనీ వద్ద ఉన్న చెత్త కుప్పల్లో వదిలేచి వెళ్లి పోయారు.మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌సత్యనారాయణ గౌడ్ కథనం ...బాబుల్‌రెడ్డి నగర్‌లోని చైతన్య ప్లాస్టిక్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న చెత్త కుప్పల్లో గుర్తు తెలియని వ్యక్తులు నెలల నిండని శిశువు మృత దేహాన్ని ప్లాస్టిక్ కవర్‌లో వదిలి పెట్టి వెళ్లి పోయారు.సోమవారం ఉదయం బల్దియా పారిశుద్ధ్య పనుల కార్మికులు ప్లాస్టిక్ కవరులో ఉన్న శిశువు మృత దేహాన్ని చూశారు.వెంటనే పోలీసులకు సమాచారం అందించటంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు చని పోయి ఉన్న నెలలు నిండని శిశువు మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు.ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకొని 8వ తరగతి విద్యార్థి ఆత్మహత్య

గచ్చిబౌలి, జనవరి 5 ప్రభాతవార్త: తల్లి మందలించిందని ఓ 8వ తరగతి విద్యార్థి తాను ఉంటున్న ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా పోరుమామిళ్ల మండలం అక్కలరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దాసరిపల్లి మోహన్ తన భార్య, కుమారుడు దాసరిపల్లి శివకుమార్(14)తో కలిసి బ్రతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చాడు. ఐటి కారిడార్ పరిధిలోని గౌలిదొడ్డి జయభేరి ఫోర్ సీజన్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. ఇతని కుమారుడు శివకుమార్ నారాయణ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. గత రెండు, మూడు రోజులుగా వరుస సెలవులు రావడంతో శివకుమార్ స్కూల్‌కు వెళ్లలేదు. సోమవారం నుంచి స్కూల్ ప్రారంభం అవుతుండడంతో ఆదివారం ఉదయం ఇంట్లో ఉన్న మోహన్ భార్య తన కుమారుడికి బ్యాగు, పుస్తకాలు సర్దుకోవాలని, సోమవారం నుంచి స్కూల్ ఉన్న కారణంగా హడావిడీ చేస్తావంటూ మందలించింది. అనంతరం మోహన్ భార్య ఇంట్లో పనిచేసుకుంటుండగా, సాయంత్రం 5 గంటలకు ఇంట్లో చూడగా, సీలింగ్ రేకులకు ఉన్న రాడ్డుకు కుమారుడు శివకుమార్ ఉరివేసుకొని నిర్జీవంగా కనిపించాడు. దీంతో తల్లి వెంటనే మోహన్‌కు విషయం చెప్పింది. మోహన్ వెళ్లి చూడగా, అప్పటికే శివకుమార్ మృతిచెందాడు. దీంతో స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుప త్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ప్రేమను నిరాకరించిన యువతిపై కత్తితో ఉన్మాది దాడి

నార్సింగి, డిసెంబర్ 16 ప్రభాతవార్త : ఏకపక్షంగా ప్రేమించిన యువకుడు తన ప్రేమను యువతి నిరాకరించడంతో ఉన్మాదిగా మారాడు. యువతిపై కత్తితో దాడి చేసి పారిపోయాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్.ఐ మునీందర్ తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌లోని పంజాగుట్ట ప్రాంతానికి చెందిన పర్వతాల రోహిత్(23) ఓ హోటల్‌లో వెయిటర్‌గా పని చేస్తూ, గండిపేట మ

కన్నుల పండుగగా వెంకటేశ్వరస్వామి కళ్యాణం



వెంకటేశ్వరస్వామి కళ్యాణంలో పాల్గొన్న సంగీత దర్శకుడు మణిశర్మ.

జూబ్లీహిల్స్, జనవరి 5, ప్రభాతవార్తః
జూబ్లీహిల్స్ మాజీ కార్పొరేటర్ మామిడి లక్ష్మీభాయి నివాసంలో సోమవారం శ్రీ వెంకటేశ్వరస్వామి కళ్యాణ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. అలివేలు మంగా సమేత వెంకటేశ్వరస్వామి తిరు కళ్యాణ ఉత్సవానికి ప్రముక సంగీత దర్శకుడు మణిశర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఇక్కడ కళ్యాణ వేడుకను అత్యంత రమణీయంగా నిర్వహించారు. ఈ వేడుకలో లక్ష్మీభాయితోపాటు ఆమె భర్త ఫిల్మ్‌నగర్ 18 బస్తీల అధ్యక్షుడు మామిడి నర్సింగ్‌రావు, ఫిల్మ్‌నగర్‌లోని పలు బస్తీల నేపతలు సైతం ఇక్కడికి హాజరయ్యారు. వెంకటేశ్వరస్వామి కళ్యాణంతోపాటు మామిడి నర్సింగ్‌రావు జన్మదినం సైతం కావడంతో వారంతా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు సైతం తెలిపారు.

లాల్‌దర్వాజా మహంకాళి దేవాలయ క్యాలెండర్ ఆవిష్కరణ

లాల్‌దర్వాజా మహంకాళి దేవాలయ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కృష్ణాయాదవ్, సభ్యులు

చాంద్రాయణగుట్ట, జనవరి 5, ప్రభాతవార్త : చారిత్రక లాల్‌దర్వాజా శ్రీ సింహవాహిణి మహంకాళి దేవాలయ ప్రతినిధి రంగ హరినాథ్ గౌడ్ ఆధ్వర్యంలో ముద్రించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్ సోమవారం ఆలయ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. అమ్మవారి పేరుతో ముద్రించిన క్యాలెండర్ ఎంతో ఉపయుక్తంగా ఉందన్నారు. అంతకుముందు కృష్ణాయాదవ్ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కన్వీనర్ జి.అరవింద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పి.సతీష్ ముదిరాజ్, ప్రతినిధులు పాల్గొన్నారు.

సాయిబాబాకు ఘన నివాళులు అర్పించిన టీడీపీ నేతలు

ముషీరాబాద్, జనవరి 5, ప్రభాతవార్త: ఇటీవల గుండెపోటుతో హఠాన్మరణం పొందిన సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి. సాయిబాబాకు తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ కమిటీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం మోక్ష బ్యాంకెట్ హాల్ నందు సాయిబాబా దశదినకర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమంకు తెలుగుదేశం పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు, సికింద్రాబాద్ పార్లమెంట్ నాయకులు నల్లెల్ల కిషోర్, నాగు నగేష్, పి.బాలరాజ్‌గౌడ్, శ్రీపతి సతీష్, కట్టా రాములు, కరణం కిరణ్, తడక వినోద్, భవాని శ్రీనివాస్, ఎం.రాజు, వెంకటేష్ చౌదరి, జోగిందర్‌సింగ్, దినేష్, శుక్రవేది, బి.వై.శ్రీకాంత్ తదితరులు పాల్గొని సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

వైద్య శిబిరాలు సమాజ సేవకు దోహదం

సత్యసుందర్ హెల్పింగ్ అండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరంలో మందులను పంపిణీ చేస్తున్న చైర్మన్ ఠాకూర్‌గోపాల్‌సింగ్

అప్జల్‌గంజ్, జనవరి 5, ప్రభాతవార్త:
ఉచిత వైద్య, శిబిరాలు, సమాజ సేవకు ఎంతగానో, దోహదం చేస్తాయని బిజెపి గొల్కొండ జిల్లా బిజెపి అధ్యక్షులు టి.ఉమా మహేంద్ర, చంద్రశేఖరులు పేర్కొన్నారు. సోమవారం బేగంబజార్‌లోని సనాతన ధర్మశాల అవరణలో సత్యసుందర్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్, చైర్మన్ ఠాకూర్‌గోపాల్ సింగ్ నేతృత్వంలో మెడిసిటి ఆసుపత్రి సహకారంతో, పేద రోగులకోసం, ఉచితవైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉచితవైద్య శిబిరాన్ని గోల్కొండ జిల్లా అధ్యక్షులు ఉమామహేంద్ర, బిజెపిసీనియర్ నాయకులు రఘునందన్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరిసింగ్, బిఆర్ఎస్ నాయకులుబెజ్జి శ్రీనివాస్, దినేష్‌యాదవ్‌లతో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఒక మంచి ఆలోచనతో, ఆరోగ్యమే మహాభాగ్యం అనే నానుడి, ప్రతి ఒకరు అనే అనుసరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రహించి. ప్రతి పేదవానికి, ఉచితంగా వైద్య శిబిరాలను, గత రెండు సంవత్సరాలుగా విజయవంతంగానిర్వహించుకుంటూ ముందుకు వెళ్లడం గొప్ప విషయమన్నారు. చైర్మన్ గోపాల్‌సింగ్ మాట్లాడుతూ సుమారు1000మందికిపైగా వైద్యపరీక్షలను చేసి మందులను అందచేసినట్లు చెప్పారు. ఈసారి గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సహకారంతో క్యాన్సర్ స్కానింగ్, పెట్‌స్కానింగ్, నిర్వహించామన్నారు. ఈకార్యక్రమంలో మెడిసిటి ఆసుపత్రి సి.ఈ.ఓ ఈనీష్‌మర్చంట్, రానుసింగ్‌రాజ్ పురోహిత్, సత్యసుందర్ హెల్పింగ్ అండ్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సంస్కారభరతి అధ్యక్షుడిగా భోగిరెడ్డి శ్రీనివాస్

మోతీనగర్‌లోని ఐరా స్టూడియోలో జరిగిన సంస్కార్ భారతి కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న తెలంగాణ ప్రాంత వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కే.కే.వీ శర్మ.

యూసుఫ్‌గూడ, జనవరి 5, ప్రభాతవార్త :
భావితరాలకు పండుగలు, పర్వదినాల ఆవష్యకతతో పాటు మన సంస్కృతి సంప్రదాయాలను తెలియపర్చటంలో సంస్కార భారతి ముందుంటుదని సంస్కార్ భారతి తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కే.కే.వీ శర్మ అన్నారు. మోతీనగర్‌లోని ఐరా స్టూడియోలో జరిగిన సంస్కార భారతి కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్కార భారతి హైదరాబాద్ నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షులుగా భోగిరెడ్డి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎల్వీ చిన్నారావు. ఉపాధ్యక్షులుగా పి.మాధవ్, ప్రధాన కార్యదర్శిగా ఎమ్ శశివర్ధన్ శర్మ, సంయుక్త కార్యదర్శిగా కె.శ్రీదేవీ, వి.శ్రీనివాస్, కార్యదర్శిగా గీతాంజలి, దృశ్యకళావిభాగం కన్వీనర్ సంతోషిణి, కళావిభాగం ఉజ్వల ప్రముఖ సునిందినిలతో ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు భోగిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్షునిగా ఎన్నుకున్నారని తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు అద్దంపట్టే విధంగా వేడుకలు నిర్వహించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు.

శ్రీకృష్ణుడి లీలావినోదాల సమాహారం కూచిపూడి నృత్యరూపకం

నాంపల్లి, జనవరి 5 ప్రభాతవార్త : శ్రీకృష్ణుడి లీలావినోదాల సమాహారమే శ్రీకృష్ణ పారిజాతం కూచిపూడి నృత్యరూపకమని, ఇంద్రుడు బహూకరించిన పారిజాత పుష్పం చుట్టూ తిరిగే ఒక దివ్య కథే ఈ కూచిపూడి నృత్యరూపకమని భారత్ వరల్డ్ రికార్డ్స్ వ్యవస్థాపకుడు లయన్ కె.వి.రమణారావు ప్రశంసించారు. భారతీయ శాస్త్రీయ నృత్యవైభవాన్ని, శ్రీకృష్ణుని గాథను చాటిచెప్పే సంస్థ ప్రయత్నాన్ని ఆయన శ్లాఘించారు. స్పందన నృత్యకేళి స్కూల్ ఆఫ్ డ్యాన్స్ ఆధ్వర్యంలో నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో భాగ్యనగరంలో దశావశాంతాల నృత్యకేళి పేరిట ఈ నృత్యరూపకం డా. నామిని రవికుమార్ నిర్వహణలో నయనానందకరంగా ప్రదర్శింపబడి ఆహూతులను మంత్రముగ్ధులను చేసింది. డా. నామిని రవికుమార్, స్పందన నృత్యకేళి, మనస్పందన చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు శ్రీకృష్ణుని లీలాగాథలు అత్యంత అద్భుతంగా చూపించడం విశేషం. సత్యభామ ధైర్యం, అందం, కృష్ణుడిపట్ల అమితమైన ప్రేమానురాగాలు, స్వచ్ఛమైన భక్తిహృదయం, దయాగుణం, ప్రశాంతతకు ప్రతిరూపంగా రుక్మిణిదేవి, నారదమునిలోని చతురత ఈ రూపకంలో కొట్టొచ్చినట్లు కనబడుతుంది. ఈ కార్యక్రమంలో లయన్ కె.వి.రమణారావు, గురువులు శ్రీకాంత్ గౌడ్, జక్క కృష్ణ, డా. మీనాక్షి, మోహనకృష్ణ, అడ్లసతీష్ తదితరులు అతిథులుగా పాల్గొని కళాకారులను ఘనంగా సన్మానించి ఎంతగానో అభినందించారు.

శ్రీకృష్ణ పారిజాతం కూచిపూడి నృత్యరూపకంలో ఒక దృశ్యం

మానవ సేవే-మాధవ సేవ అనే సంకల్పంతో బాస్ ప్రతినిధులు

గోషామహల్, జనవరి 5 ప్రభాతవార్త: అనాథ బాలలను చేరదీసి భాగ్యనగర్ అయ్యప్పసేవాసమితి విద్య బోధనలు చేయించడం సంతోషదాయకమని రాజ్యసభ సభ్యులు మందడి అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఆయన బాస్ ప్రతినిధులతో కలిసి ఉస్మాన్‌గంజ్‌లో ఉన్న భాగ్యనగర్ అయ్యప్పస్వామిసేవాసమితి ఆధ్వర్యంలో నడుస్తున్న అనాథ ఆశ్రమాన్ని సందర్శించారు. సేవాసమితి ఆధ్వర్యంలో శబరిమలైలోని కాలికాట్‌లో జనవరి 7వ తేదినుంచి జరిగే అన్నదాన కార్యక్రమానికి లారీలో తీసుకు వెళ్లే నిత్యావసరసరుకులకు జెండాను ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ సేవే-మాధవ సేవ అనే సంకల్పంతో బాస్ ప్రతినిధులు గత 20సంవత్సరాలుగా అనాథ ఆశ్రమం ద్వారా చిన్నారులకు విద్యబోధనలు, సంస్కృతం, ఆటపాటలతోపాటు వారి ఆరోగ్యంపట్ల శ్రద్ధ తీసుకోవడం అభినందనీయమన్నారు. అదే విధంగా సమాజంలో తల్లిదండ్రులు తమ పిల్లలను అనాథగా వదిలివేయడం పట్ల తీవ్ర ఆవేధన వ్యక్తం చేశారు. శబరిమలైలో స్వాములకు అన్నదానం చేయడమంటే సాధారణ విషయం కాదన్నారు. పట్టుదల, కృషి ఉంటేనే అధ్యక్షులు మేడిశెట్టి రాకేష్‌గురుసా స్వామి కేరళలోని అయ్యప్ప స్వామి సన్నిధిలో ఉన్న కాలికట్ ఆశ్రమం వద్ద అన్నదానంతోపాటు ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉస్మాన్‌గంజ్ అయ్యప్ప స్వామి కార్యాలయంలో సంప్రదించాలని లేక డబ్ల్యుడబ్ల్యు.డబ్ల్యు బాస్ హైదరాబాద్.కామ్ ఈ-మెయిల్:ఇన్‌ఫో ఎడ్‌దిరేట్‌ఆప్ బాస్‌హైదరాబాద్.కామ్ ద్వారా విరాలను అందివచ్చునన్నారు. స్వామి మాలధరించిన స్వాములకు45 రోజులనుంచి అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి ప్రధాన కార్యదర్శి భద్రేశ్వర్‌గురుస్వామి మాటాడుతూ జనవరి 7వ తేది నుంచి 14 తేది వరకు రోజుకు 20వేలపైగా అయ్యప్పస్వాములకు అన్నదానం చేయడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో బాస్‌ప్రతినిధులు విజయబాస్కర్, విజయేందర్‌రెడ్డి, దేవతఓంకార్‌గుప్త, నార్లజగదీష్, నర్సింగ్‌రావు, వెంకటేశం గురుస్వామి, క్యాతం రాధాకృష్ణ, కట్ట హరికృష్ణ, నరేష్ పటేల్, శ్రీహరి, వేణుగోపాల్, మాజీ సెట్విన్ డైరెక్టర్ ఎస్.ధన్‌రాజ్‌గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

శబరిమలైలో అన్నదానం కోసం తీసుకువెళ్తున్న సరుకులకు జెండా ఊపి ప్రారంభిస్తున్న రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, బాస్ అధ్యక్షులు మేడిశెట్టిరాకేష్, భద్రేశ్వర్‌లు

స్థానిక ఎన్నికలలో పోటీ చేస్తాం : కపిలవాయి దిలీప్‌కుమార్

ముషీరాబాద్, జనవరి 5, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జరగబోయే మున్సిపాలిటీ, జెడ్‌పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలలో తెలంగాణ రాష్ట్ర రాష్ట్రీయ లోక్‌దళ్ పార్టీ అన్ని స్థానాలలో పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కపిలవాయి దిలీప్‌కుమార్ స్పష్టం చేశారు. సోమవారం కవాడిగూడలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ పాలన పూర్తిగా విఫలమయిందని, ప్రస్తుత కాంగ్రెస్ పాలన అంతకంటే దారుణంగా ఉందని విమర్శించారు. రాష్ట్రంలో ఏర్పడిన రాజకీయ ఖాళీని బీజేపీ వినియోగించుకోలేక పోయిందని, ఆ ఖాళీని స్థానిక సంస్థల ఎన్నికల నుంచే రాష్ట్రీయ లోక్‌దళ్ పూర్తి చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు మార్పుకై ఎదురుచూస్తున్నారని, ప్రజల ఆకాంక్షలకు తగిన విధంగా, రాష్ట్రీయ లోక్ దళ్ సిద్ధమవుతోందని, అందులో భాంగంగా, మార్చి 1వ తేదీ భారీ బహిరంగ సభ నిర్వహించనున్నామని వివరించారు. ఈ సమావేశంలో టీఆర్ఎల్‌డీ పోలిట్‌బ్యూరో ఛైర్మన్ వి.వి.సత్యనారాయణ, తెలంగాణ యూత్‌వింగ్ అధ్యక్షులు రాజ్‌కుమార్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కృష్ణవిక్రమ్, అధికార ప్రతినిధి బీరప్ప, హైదరాబాద్ అధ్యక్షులు బేగ్, నరసింహారావు, మహిళా అధ్యక్షురాలు అమరావతి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టీఆర్ఎల్‌డీ అధ్యక్షులు కపిలవాయి దిలీప్‌కుమార్

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

నార్సింగి, జనవరి 5 ప్రభాతవార్త : గుర్తు తెలియని మహిళ మృతదేహంను సోమవారం నార్సింగి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గండిపేట మండలం పుప్పాలగూడ గ్రామం ఎల్ఐసి కాలనీ పార్కు సమీపంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉందని స్థానికులు గుర్తించి 100.కు సమాచారం అందించారు. 100.నుంచి సమాచారం రావడంతో నార్సింగి పెట్రోలింగ్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మహిళ మృతదేహంను పరిశీలించారు. మృతురాలు 30-40. సంవత్సరాల మధ్య వయసు ఉంటుందని, ఒంటిపై నీలంరంగు స్వెటర్ ధరించి ఉందని తెలిపారు. స్థానికులు ఈమె బిక్షం అడుగుతూ తమ కాలనీలో తిరిగేదని పోలీసులకు వివరించారు. ఈమెకు సంబంధించిన వారుంటే నేరుగా నార్సింగి పోలీసు స్టేషన్‌కు వచ్చి సంప్రదించాలని పోలీసులు తెలిపారు. మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి, కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ మహిళది సహజ మరణమా? మరేమైన కారణముందా అన్నది పోస్టుమార్టం అనంతరం తెలుస్తుందని నార్సింగి పోలీసులు వివరించారు.

మధుర జ్ఞాపకాలలో ఓలలాడిన పూర్వవిద్యార్థులు

నార్సింగి, జనవరి 5 ప్రభాతవార్త : 1991-1992. బ్యాచ్ పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం సందడిగా జరిగింది. మూడున్నర దశాబ్దాల తరువాత తొలి సారిగా కలుసుకున్న అలనా టి విద్యార్థులు ఒక్కసారిగా సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. పదో తరగతి చదువుకునే సమయంలో పెట్టుకున్న నిక్‌నేమ్‌లతో పిలుచు కొని, తరగతి గదిలో తాము ఏ బేంచ్‌లో కుర్చునే వాళ్లమో? ఏ ఉపాధ్యాయుడంటే భయమో? ఏ సబ్జెక్టు ఇష్టమో తదితర అంశాలను తరచి తరచి గుర్తు చేసుకొని సంతోషానందాల జడి వానలో మునిగి తేలారు. ఆ పాత మధుర జ్ఞాపకాలలో ఓలలాడి, ఆనందపరవశుల య్యారు. కొందరు రాజకీయ నాయకులుగా, ప్రజా ప్రతినిధులుగా, మరికొందరు ప్రభుత్వ ఉద్యోగులుగా, ఇంకొందరు వ్యాపారస్థులుగా జీవితాలలో స్థిరపడిపోయారు. అందరూ తమ తమ హోదాలు మరిచి పోయి పదో తరగతి పిల్లల్లా ఆడి, పాడి మధురమైన క్షణాలను ఆస్వా దించారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన గురువులను ఘ నంగా సత్కరించారు. ఈ వేడుకలలో కాంగ్రెస్ సీనియర్ నేత, హైద ర్షాకోట్ మాజీ సర్పంచ్ పూలపల్లి కృష్ణారెడ్డి సైతం పాల్గొని గురువులు నేర్పించిన క్రమశిక్షణ వల్లనే జీవితంలో అంచెలంచెలుగా ఎదిగామని, సు ఖవంతమైన జీవితాన్ని గడుపుతున్నామన్నారు. మన ఎదుగుదలకు త ల్లి దండ్రుల తరువాత అంతే నిస్వార్థంగా ప్రోత్సహించే వారు ఒక్క గురువు లు మాత్రమేనని, వారిని జీవితాంతం గుర్తుంచుకోవాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న అలనాటి విద్యార్థుల దృశ్యం.

బాల్కనీ నుంచి జారిపడి వృద్ధురాలు మృతి

చార్మినార్, జనవరి 5 ప్రభాతవార్త : ఇంటిలోని బాల్కానీ నుంచి ఓ వృద్ధురాలు జారి పడి మృతి చెందిన సంఘటన కాలాఫత్తర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఇంద్రానగర్ ప్రాంతానికి చెందిన ఇషాక్ భార్య మెహరున్నీషా బేగం (55)తో కలిసి నివాసం ఉంటున్నాడు. కాగా సోమవారం మధ్యాహ్నం మెహరున్నీషా బేగం ఇంటిలోని మొదటి అంతస్తు బాల్కానీ నుంచి కిందికి చూస్తున్నది. మధుమేహంతో బాధ పడుతున్న మెహరున్నీషా బేగంకు షుగర్ స్థాయి తగ్గటంతో తల తిరిగి బాల్కానీ నుంచి కిందికి పడిపోయింది. స్పృహ తప్పి పడి పోయిన మెహరున్నీషా బేగంను ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈ కేసును కాలాఫత్తర్ సబ్ ఇన్‌స్పెక్టర్ జ్యోతిక ఆధ్వర్యంలోపోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్రూజ్ ప్రయాణం పేరుతో కుచ్చుటోపీ

హైదరాబాద్, జనవరి 5 ప్రభాతవార్త: విలాసవంతమైన క్రూజ్ షిప్‌లో షికారు చేయాలనుకున్న ఓ నగరవాసి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్నారు. కొచ్చి, లక్షద్వీప్, ముంబయి నగరాల మీదుగా సాగే క్రూజ్ ప్రయాణం కోసం ఆన్‌లైన్‌లో వెతికిన బాధితుడు.. చివరకు రూ.2,42,488 పోగొట్టుకున్నారు. నగరంలోని కాచిగూడకు చెందిన ఓ వ్యక్తి డిసెంబరు 26న క్రూజ్ ప్యాకేజీల కోసం గూగుల్‌లో శోధించారు. అక్కడ కనిపించిన ఓ వెబ్‌సైట్‌ను నిజమైనదే అని నమ్మి, నలుగురు సభ్యుల ప్రయాణానికి బుకింగ్ చేసుకున్నారు. ఇందుకుగాను మొదట రూ.23,680 అడ్వాన్స్‌గా చెల్లించారు. ఆ తర్వాత అసలు మోసం మొదలైంది. లక్షద్వీప్ వెళ్లాలంటే ప్రత్యే క పర్మిట్ లెటర్లు కావాలని, పిల్లలకు అదనపు చార్జీలు ఉంటాయని నమ్మించి మరికొంత డబ్బు లాగారు. చెల్లింపుల సమయంలో సాంకేతిక సమస్యలు వస్తున్నాయని, చెక్‌అవుట్ సమయంలో డబ్బు రీఫండ్ అవుతుందని మాయ మాటలు చెప్పి బాధితుడితో పలు దఫాలుగా డబ్బు కట్టించుకున్నారు. చివరకు పేమెంట్ ఫెయిల్ అయ్యిందంటూ బుకింగ్‌ను రద్దు చేశారు. రద్దయిన టికెట్ల డబ్బు మొత్తం వెనక్కి రావాలంటే క్యాన్సిలేషన్ చార్జీల కింద మరో రూ.48, 500 కట్టాలని డిమాండ్ చేశారు. వాట్సాప్‌లో కార్డెలియా క్రూజ్ కస్టమర్ కేర్ ప్రతినిధులమని చెప్పుకుంటూ నమ్మించి, మొత్తం రూ.2,42,488 కాజేశారు. మోసపోయామని గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL FAMILY COURT JUDGE INTEGRATED FAMILY COURT COMPLEX, KALPATARU BUILDING AT :: HYDERABAD
O.P.NO. 494 OF 2024

BETWEEN
N. Lakshmi Karuna, W/o. N. Santosh, D/o. R. Suresh Varma, Occ: Household, R/o. H.No. 4-8-185, Gowliguda, Hyderabad. ...Petitioner

AND
N. Santosh ...Respondent

To,
N. Santosh, S/o. Late N. Raju, Occ: Mechanic, R/o. H.No. 11-3-456, Parsigutta, Seetaphalmandi, Hyderabad. ...Respondent

Please take notice that the above named petitioner has filed the above said original petition for Divorce U/s. 13 (a) (ib) of Hindu Marriage act. The said O.P is posted to on 31.1.2026 at 10.30 A.M for the purpose of your appearance in the matter. Hence you are hereby requested to appear in person, before the above said court, otherwise the matter will be decided in your absence AS PER THE LAW.

// BY ORDER OF THE COURT //
S. VIDHYA SAGAR
Advocate
H.No.5-1-444, Jam Bagh, Hyderabad, Cell: 9441009900
Council for petitioner

కళాకారుల సంక్షేమమే సంస్థ లక్ష్యం : ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ

- 5 నుంచి 14 వరకు ఎన్టీఆర్ స్టేడియంలో హస్తకళా ప్రదర్శన

ముషీరాబాద్, జనవరి 5, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో ఉన్న వివిధ హస్తకళాకారుల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ హస్తకళల అభివృద్ధి సంస్థ పనిచేస్తుందని సంస్థ ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ స్పష్టం చేశారు. సోమవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో గోల్కొండ క్రాఫ్ట్ అండ్ టెక్స్‌టైల్స్ మేళాను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రదర్శన ద్వారా రాష్ట్రంలోని పలు నగరాలతో పాటు, ఇతర రాష్ట్రాలలో సైతం పలు ప్రదర్శనలు ఏర్పాటుచేసి, హస్తకళాకారులు స్వయంగా తమ ఉత్పత్తులను వినియోగదారులకు విక్రయించుకునే సౌకర్యం కలుగచేస్తుందని తెలిపారు. మేనేజర్ మసూద్ అలీ మాట్లాడుతూ ఉత్పత్తి దారుల నుంచి నేరుగా కొనుగోలు దారులకు చేరవేస్తున్న ఈ ప్రదర్శనలో సరసమైన ధరలకే మంచి నాణ్యమైన వస్తువులు అందుబాటులో ఉంటాయని అన్నారు. డోక్రా కళారూపాలు, బెరియాల్ పెయింటింగ్స్, బీద్రి, నిర్మల్ పెయింటింగ్స్, ఇత్తడి కళాకృతులు, వెదురు కళాకృతులు, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, ఇమిటేషన్ జ్యూవెలరీ, జ్యూట్ వస్తువులు, పోచంపల్లి, గద్వాల్, నారాయణపేట్, బెంగాల్ కాటన్ చీరలు వంటి అనేక వస్తువులు ఇక్కడ అమ్మకానికి ఉంటాయని పేర్కొన్నారు. సుమారు 130 మంది హస్త కళాకారులతో ఏర్పాటుచేసిన ఈ ప్రదర్శన ఈనెల 5 నుంచి 14వ తేదీ వరకు కొనసాగుతుందని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్రారంభోత్సవ సమావేశంలో నాబార్డ్ ఛీఫ్ జనరల్ మేనేజర్ బి.ఉదయ భాస్కర్, ఓఎస్‌జీ ఎస్ఎం భాషా, సీనియర్ మేనేజర్ నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ క్రాఫ్ట్ మరియు టెక్స్‌టైల్స్ మేళాను ప్రారంభిస్తున్న తెలంగాణ హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ తదితరులు

డబుల్ బెడ్ రూమ్స్ వద్ద ఉన్న డంపింగ్ యార్డ్‌ను వెంటనే తరలించాలి : సిపిఎం

నిజాంపేట్, జనవరి 5, ప్రభాతవార్త
నిజాంపేట్ సర్కిల్ పరిధి డబుల్ బెడ్ రూమ్స్ వద్ద ఉన్న డంపింగ్ యార్డ్‌ను వెంటనే తరలించాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిజాంపేట్ సర్కిల్ కమిషనర్‌కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కమిటీ సభ్యుడు రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్స్ వద్ద ఉన్న డంపింగ్ యార్డ్ తరలించి స్థానికుల ఆరోగ్యాలను కాపాడాలని కోరారు. విపరీతమైన దుర్గంధంతో డబుల్ బెడ్ రూమ్స్ వాసులు అక్కడ నివసించలేని పరిస్థితి నెలకొందని, దోమలతో డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాల బారిన పడుతున్నారని తెలిపారు. డంపింగ్ యార్డ్‌ను ఆనుకొని మహిళా డిగ్రీ కళాశాల నిర్మాణం పూర్తి అయినా, ఈ డంపింగ్ యార్డ్ కారణంగానే మహిళా కళాశాల ఏర్పాట్లు జాప్యం అవుతుందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. స్థానికంగా బాచుపల్లి, నిజాంపేట్ డబుల్ బెడ్ రూమ్స్, తెలుగు యూనివర్సిటీ, మహిళా డిగ్రీ కళాశాల, సాయి నగర్, రాజీవ్ గృహకల్ప పరిసర కాలనీల ప్రజలు డంపింగ్ యార్డ్‌తో చాలా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. నిజాంపేట్ సర్కిల్ కమిషనర్, రెవెన్యూ అధికారులు కల్పించుకొని డబుల్ బెడ్ రూమ్స్ వద్ద ఉన్న డంపింగ్ యార్డ్‌ను వెంటనే తరలించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు సమస్యగా మారిన డంపింగ్ యార్డ్‌ను అక్కడి నుంచి తరలించాలని సిపిఎం పార్టీగా డిమాండ్ చేస్తున్నదని, లేని పక్షంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రాజీవ్ గృహకల్ప శాఖ కార్యదర్శి వి.బాలపీర్, సిపిఎం పార్టీ రాజీవ్ గృహకల్ప నాయకులు పి. స్వామి తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కి వినతి పత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

వెంగళ్‌రావునగర్‌లోని ఆలయాల్లో హుండీల లెక్కింపు

యూసుఫ్‌గూడ, జనవరి 5, ప్రభాతవార్త :
వెంగళ్‌రావునగర్ డివిజన్ పరిధిలోని జీటీఎస్ కాలనీలో శ్రీ వీరాంజనేయ భవానీ శంకర అయ్యప్పస్వామి సాయిబాబా దేవస్థానంలో సోమవారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఆరు నెలలకు గాను రూ.5 లక్షల 12వేల 546లు లెక్కించారు

పేదలకు వైద్య సేవలకు ప్రాముఖ్యత : ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

సికింద్రాబాద్, జనవరి 5 ప్రభాతవార్తః నిరుపేదలకు వైద్య సేవలకు అధిక ప్రాముఖ్యతను కల్పిస్తామని, విద్య, వైద్య రంగాలను పేదలకు చేరువలో నిలుపుతామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన 20 మంది లబ్దిదారులకు సుమారు 9 లక్షల విలువజేసే ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను సితఫల్‌మండీలోని ఎం.ఎల్.ఏ. క్యాంపు కార్యాలయంలో పద్మారావు గౌడ్ సోమవారం కార్పొరేటర్లు, అధికారులు, నేతలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు వైద్య సేవలను అందించడంలో తాము అగ్ర స్థానంలో నిలుస్తామని అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన ప్రజల సమస్యల పరిష్కారానికి సితఫల్‌మండీలోని తమ క్యాంపు కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను పొందేందుకు దళారీలను ఆశ్రహించవద్దని, ఎవరికీ డబ్బులు చెల్లించరాదని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కంది శైలజ, సామల హేమ, రాసురి సునీత తదితరులు పాల్గొన్నారు.

సామ్రాజ్యవాద దాడిని ఖండిస్తూ ట్రంప్ దిష్టిబొమ్మ దగ్ధం

ఛత్రినాక చౌరస్తాలో ట్రంప్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న సీపీఐ నేతలు

చాంద్రాయణగుట్ట, జనవరి 5, ప్రభాతవార్త : వెనుజువెలాపై అమెరికా సామ్రాజ్యవాద దాడిని నిరసిస్తూ సీపీఐ గౌలిపురా డివిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సోమవారం ఛత్రినాక చౌరస్తాలో అమెరికా అధ్యక్షులు ట్రంప్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అమెరికాకు వ్యతిరేఖంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. హైదరాబాద్ జిల్లా సీపీఐ పార్టీ కార్యవర్గ సభ్యులు గడ్డమీది చంద్రమోహన్ గౌడ్ మాట్లాడుతూ వెనుజువెలా అమెరికాకు మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తుందన్న నెపంతో ఆ దేశంపై దాడి చేసి, దేశాక్ష్యాని బంధించటం సిగ్గు చేటన్నారు. చమురు నిల్వలను దోచుకునే కుట్రలో భాగంగానే ఈ దాడులన్నారు. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ మానవీయ కోణంలో ప్రతి ఒక్కరు అమెరికా దాడిని తీవ్రంగా ఖండించి, వెనుజువెలాకు అండంగా నిలవాలని కోరారు. వెనుజువెలా దేశాధ్యక్షులు మధురోను, అతని సతీమణిని బందిపోటు దొంగల్లా న్యూయార్క్‌కు తరలించటాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యవర్గ సభ్యులు జి.ప్రభాకర్, తిరుపతి, డివిజన్ నాయకులు సంతోష్, శ్రీశైలం, ఆటో యూనియన్ నాయకులు నాగరాజు, ఎన్.అనిల్, సాయి, మహేందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి బోయ కులస్తులను వెంటనే ఎస్టీ జాబితాలో చేర్చాలి
బోయ హక్కుల పోరాట సమితి డిమాండ్

సమావేశంలో మాట్లాడుతున్న మీనగా గోపి

సైఫాబాద్, జనవరి 5 ప్రభాతవార్త: రాష్ట్రంలోని ఆరున్నర లక్షల మంది వాల్మీకి బోయలకు గతంలో సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం ఎస్టీ జాబితాలో చేర్చాలని బోయ హక్కుల పోరాట సమితి డిమాండ్ చేసింది. రేవంత్‌రెడ్డి పిసిసి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు వాల్మీకి బోయ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చుతామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొని, ఆనేక బహిరంగ సభల్లో హామీ ఇచ్చారని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా పట్టించుకోకపోవడం దారుణమని పోరాట సమితి ఆరోపించింది. సోమవారం బషీర్‌బాగ్ ప్రెక్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు మీనగా గోపి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి మాటను నమ్మి ఆరున్నర లక్షల మంది బోయ కులస్తులు కొండంత ఆశతో ఎదురు చూస్తున్నారని, కాని సిఎం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ఎస్టీ జాబితాలో చేర్చాలని, ఒకరికి ఎంఎల్‌సి కేటాయించాలని, వాల్మీకి బోయ కార్పోరేషన్‌కు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో రోజుకు పదివేల మంది వాల్మీకి బోయ కులస్తులతో ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో సమితి నాయకులు నరసింహనాయుడు, అజ్జ బాయ్ పాల్గొన్నారు.

తెలుగుజాతి రైతుల పండుగ సంక్రాంతి

గురువులను సంక్రాంతి నంది అవార్డుతో ఘనంగా సత్కరిస్తున్న లలితారావు తదితర ప్రముఖ అతిథులు

రవీంద్రభారతి, జనవరి 5 ప్రభాతవార్త : తెలుగుజాతి, ముఖ్యంగా రైతులు అత్యంత అద్భుతంగా ఆనందోత్సాహాలతో జరుపుకునే పండుగ సంక్రాంతి అని వక్తలు అన్నారు. రైతులకు కొత్తపంట చేతికందడం, అల్లుడు-కూతుర్ల ఆహ్వానం, పండివంటలు, కొన్ని ప్రదేశాల్లో కోళ్లపందాలు, భోగిమంటలు, బొమ్మల కొలువు, నీలాకాశంలో పతంగులను ఎగురవేయడం ఇలా ఆయా ప్రదేశాల ప్రాముఖ్యతనుబట్టి ఎంతో ఆహ్లాదకరంగా ఈ పండుగను 3రోజులపాటు ఘనంగా జరుపుకొంటారని గుర్తుచేశారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థ భారత్ ఆర్ట్స్ అకాడమీ వారంరోజులు ముందుగానే సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించడం, వివిధాంశాలతో కళాకారులు తమ నృత్యప్రదర్శనలతో ఉర్రూతలూగించడం విశేషం. రవీంద్రభారతి ప్రధాన మందిరంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షురాలు లయన్ లలితారావు నిర్వహణలో ఉదయం నుండి సాయంత్రం వరకు జరిగిన ఈ సంక్రాంతి సంబరాలకు విచ్చేసిన ప్రముఖ అతిథులు ఆయారంగాలలో విశేష సేవలందిస్తున్న సుప్రసిద్ధులకు భారత్ నంది, సంక్రాంతి నంది, సంగీత గురువులను జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా కళాకారుల శాస్త్రీయ, సంప్రదాయ, జానపద కళాప్రదర్శనలు సభికులను ఎంతగానో అలరించి తన్మయుల్ని చేశాయి.

9న వరంగల్‌లో బిసి ఉద్యోగుల రాష్ట్ర మహాసభ, సర్వసభ్య సమావేశం

సైఫాబాద్, జనవరి 5 ప్రభాతవార్త: తెలంగాణ విద్యుత్ సంస్థలైన ట్రాన్స్‌కో, జెన్కో, ఎన్పీడిసిఎల్ సంస్థల్లో పనిచేస్తున్న వేలాది మంది బిసి ఉద్యోగుల రాష్ట్రస్థాయి మహాసభ, సర్వసభ్య సమావేశంలో ఈ నెల 9న వరంగల్ నగరంలో జరుగుతుందని తెలంగాణ విద్యుత్ బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం తెలిపింది. ఈ సభలో ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొంటారని అలాగే రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడిపాక కుమారస్వామి, ముత్యం వెంకన్నగౌడ్ తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య సంఘం రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీ, టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. 2014 , జూన్ 2 తర్వాత ఇచ్చిన పదోన్నతులను సమీక్షించి నష్ట పోయిన బిసి ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని, మెరిట్ ప్రాతిపదికన సీనియారిటిని ప్రకటించి ఇప్పటికే ఇచ్చిన జెఎల్ఎం, ఎఈ, సబ్ ఇంజనీర్, జెఎఓ, కెమిస్ట్, జూనియర్ అసిస్టెంట్ తదితర ఫీడెర్ పోస్టుల అదోకో పదన్నోతులు సమీక్షించి రెగ్యులర్ పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. 1999

విద్యుత్ బిసి ఉద్యోగుల సంఘం డైరీ, క్యాలెండర్, టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఆర్.కృష్ణయ్య

నుంచి 2004 వరకు విద్యుత్ సంస్థల్లో ఉద్యోగులుగా చేరిన వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఆర్జిజన్లుగా పనిచే స్తున్న 24 వేలమంది ఉద్యోగులకు అర్హతలను బట్టి పదో న్నతలు కల్పించాలని, 2023 జూన్ 1వ తేదీ నుంచి విద్యుత్ సంస్థలో చేరిన ఉద్యోగులకు ఇపిఎఫ్ కాంట్రి బ్యూషన్ 15 శాతం సిలింగ్‌ను ఎత్తివేసి వాస్తవ బేసిక్, డిఎలపై ఈపిఎఫ్ సంస్థలో జమ చేయాలని, జెన్కో కారుణ్య నియామకాల్లో ఇంజనీరింగ్ అర్హతలు కలిగిన అభ్య ర్థులకు సబ్‌ఇంజనీర్‌గా ఉద్యోగం కల్పించాలని, స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు సాధనకై రాజ్యాంగ సవరణ చేయాలని ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు జి.బ్రహ్మందర్‌రావు, ఎం.విజయకుమార్, ప్రేమ్‌కుమార్, యాదగిరి, బోబ్బిలి మురళి, యు.అశోక్, మారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేశవగిరి చెన్నమల్లిఖార్జున స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు

చాంద్రాయణగుట్ట, జనవరి 5, ప్రభాతవార్త : పాతబస్తీ చాంద్రాయణగుట్ట కేశవగిరిపై వెలసిన చారిత్రక శ్రీ భ్రమరాంబదేవి సమేత శ్రీ చెన్నమల్లిఖార్జునస్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ ప్రధాన అర్చకులు కోటి హరీష్ కుమార్ ఆధ్వర్యంలో వేద పండితులచే మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ పూజలలో రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి వంశీకృష్ణ, చేవెళ్ల జడ్జి శ్రీనివాసులు, జీహెచ్ఎంసి శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ, ఇంటలిజెన్స్ ఏసీపీ రుద్ర భాస్కర్, చాంద్రాయణగుట్ట ఏసీపీ ఎ.సుధాకర్, సంగారెడ్డి జిల్లా హత్నూరు తహశీల్దార్ షేక్ ఫర్హీన్ తదితర ప్రముఖులు హాజరై స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు కోటి హరీష్ కుమార్ వారికి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆలయ చరిత్రను, స్వామి మహిమలను వివరించారు. శ్రీశైల భ్రమరాంబదేవి మల్లికార్జున స్వామివార్లకు, కేశవగిరిపై వెలసిన శ్రీ భ్రమరాంబదేవి సమేత శ్రీ చెన్నమల్లికార్జున

చెన్నమల్లికార్జున స్వామివార్లను దర్శించుకున్న ప్రముఖులు

స్వామివార్లకు గల సామీప్యతను వివరించారు. శ్రీశైలంలో కొలువైన ఆది దంపతులను దర్శించుకున్నా కేశవగిరిపై వెలసిన స్వామివార్లను దర్శించినా అంతే పుణ్యం లభిస్తుందని తెలిపారు. అనంతరం ప్రముఖులను శాలువతో సన్మానించారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కోటి హరీష్ కుమార్, చెన్నకేశవస్వామి దేవస్థానం మాజీ చైర్మన్, మజ్లిస్ సీనియర్ నేత కె.నాగరాజ్, భక్తులు పాల్గొన్నారు.

బహదూర్‌పురా-2 డిప్యూటీ ఐఓఎస్‌గా కుల్దీప్ కౌర్

చాంద్రాయణగుట్ట, జనవరి 5, ప్రభాతవార్త : పాఠశాల విద్యాశాఖ బహదూర్‌పురా మండల-2 డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ (డిప్యూటీ ఐఓఎస్)గా చార్‌మహల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుల్దీప్ కౌర్‌ను (ఎఫ్ఎసి) నియమిస్తూ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఎం.సోమిరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సాధారణ విధులతో పాటు మండల స్థాయిలో విద్యాశాఖ వ్యవహారాలు సవ్యంగా సాగేందుకు ఈ నియామకం చేసినట్లు వెల్లడించారు. ఇక్కడి డిప్యూటీ ఐఓఎస్, మీరాలం ట్యాంక్, పేట్లబుర్జు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మహ్మద్ ఖలీల్ ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో కుల్దీప్ కౌర్‌ను నియమించారు. కాగా కుల్దీప్ కౌర్ గతంలో మండల-1 డిప్యూటీ ఐఓఎస్‌గా పనిచేశారు.

ఇరుముడితో అయ్యప్ప స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

శబరిమలలో ఇరుముడిని సమర్పించి అయ్యప్ప స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

అడ్డగుట్ట,జనవరి 5 ప్రభాతవార్త: మాజీ మంత్రి, అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ సోమవారం శబరిమలలో అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. ఇరుముడితో పంబా నుండి కాలి నడకన శబరిమలకు చేరుకొని అయ్యప్ప స్వామికి ఇరుముడిని సమర్పించి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి తలసాని శ్రీసాయి కిరణ్ యాదవ్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలి

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, జిల్లా కో ..ఆర్డినేటర్ సునీత

కంటోన్మెంట్,జనవరి 5 ప్రభాతవార్త: బడుగు బలహీనవర్గాలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి,6 నుంచి 9 వ తరగతులలో చేరేందుకు ప్రవేశ పరీక్ష కోసం ఈ నెల 21లోపు ఆన్‌లైన్‌లో అప్లయ్ చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా గురుకుల విద్యా సంస్థల కో .. ఆర్డినేటర్ శీలం సునీత తెలిపారు. సోమవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి చేతుల మీదుగా గురుకుల విద్యా సంస్థల ప్రవేశ పరీక్ష బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అప్లయ్ చేసుకునే అభ్యర్థులు వెబ్‌సైట్‌లో దరఖాస్తూ చేసుకోవాలన్నారు. ఆయా తరగతులలో చేరేందుకు వచ్చే నెల ఫిబ్రవరి 22న నిర్వహించే ప్రవేశ పరీక్షలకు హాజరు కావాలన్నారు. ఎస్సీ,ఎస్టీ,బిసీ,జనరల్ గురుకులాల్లో 5వ తరగతి, 6 నుంచి 9వ తరగతులలో ఖాళీగా ఉన్న ప్రవేశాలకు బాలబాలికలు దరఖాస్తూ చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో అప్లయ్ చేసుకునేందుకు కులం,ఆదాయం, బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు,పాస్ ఫొటోలు వంటి దృపత్రాలను ఆన్‌లైన్‌లో దరఖాస్తూ చేసుకోవాలన్నారు.

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బోయిన్‌పల్లి మార్కెట్ చైర్మన్ ఆర్.ఆనంద్ బాబు గౌడ్ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువకప్పి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

హోల్ సేల్ ఆర్ట్ సిల్క్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

చార్మినార్,జనవరి 5 ప్రభాతవార్త : ది హైదరాబాద్ హోల్ సేల్ ఆర్ట్ సిల్క్ క్లాథ్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా ప్రముఖ వస్త్రాల వ్యాపారి పురుషోత్తం గుప్త ఎన్నికయ్యారు. రికాబ్‌గంజ్ లోని అసోసియేషన్ భవనంలో అసోసియేషన్ కార్యవర్గానికి ఎన్నికలు జరిగాయి. ది హైదరాబాద్ హోల్ సేల్ ఆర్ట్ సిల్క్ క్లాథ్ మర్చంట్స్ అసోసియేషన్ కొత్త అధ్యక్షులుగా పురుషోత్తం గుప్తా 35 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఉపాధ్యక్షులుగా పంకజ్ అగర్వాల్,ప్రధాన కార్యదర్శిగా కమల్ పట్వారీ,కార్యదర్శిగా సునీల్ కుమార్ శర్మ,కోశాధికారిగా కమల్ అహుజాఎన్నిక య్యారని అధ్యక్షులు పురుషోత్తం గుప్త వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధి కోసం తన శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. ఇంత వరకు పురుషోత్తం గుప్త అసోసి యేషన్ ప్రధాన కార్యదర్శిగా కొనసాగారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

మహిళా జర్నలిస్టును వేధించిన ఛానల్ ఛైర్మన్‌పై కేసు నమోదు

జూబ్లీహిల్స్, జనవరి 5, ప్రభాతవార్తః తన అధికార పదవిని దుర్వినియోగం చేస్తూ ఓ యువ మహిళా జర్నలిస్టు వ్యక్తిగత సంభాషణలను రహస్యంగా రికార్డు చేసి వేధింపులకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ఓ టీవీ ఛానల్ ఛైర్మన్‌పై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. సోమాజిగూడలోని ఒక పీజీలో నివసిస్తున్న యువ మహిళా జర్నలిస్టు(22) ఒక ఛానెల్‌లో న్యూస్ ప్రెజెంటర్, జర్నలిస్టుగా పని చేస్తోంది. గత ఏడాది నవంబర్ 15 సోమాజిగూడలోని విశ్వం టీవీలో జర్నలిస్టుగా ఉద్యోగంలో చేరింది. ఆ తరువాత ఛానల్ ఛైర్మన్ విశ్వ తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ఆమె ఫోన్ కాల్స్, వ్యక్తిగత సంభాషణలను రహస్యంగా ఆడియో రికార్డింగ్‌ల ద్వారా వింటూ, వాటిని ఆధారంగా చేసుకుని వేధింపులకు, బెదిరింపులకు పాల్పడ్డాడు. ఆమె వ్యక్తిగత ఆడియో, వీడియో రికార్డింగ్‌లను కార్యాలయ వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేసి ఆమె గోప్యతకు తీవ్ర భంగం కలిగించాడు. అసభ్యకరమైన, లైంగికంగా దూషించే మాటలతో ఆమెను అవమానించడమే కాకుండా, ఆమె దుస్తులు, శరీర భాషపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, పదేపదే మానసిక వేధింపులకు గురిచేశాడు. ఈ వేధింపుల కారణంగా తాను మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురయ్యానని, తనకు న్యాయం చే యాలని ఆమె పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేర కు పోలీసులు ఛానెల్ ఛైర్మన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోరబండలో పిడిఎస్ గోధుమల అక్రమ నిల్వలపై దాడి
- 18.5 క్వింటాళ్ల గోధుమలు, వాహనం స్వాధీనం

జూబ్లీహిల్స్, జనవరి 5, ప్రభాతవార్తః పీడీఎస్‌కు చెందిన సబ్సిడీ గోధుమలను అక్రమంగా కొనుగోలు చేసి నిల్వ చేసి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై బోరబండ పోలీసులు కేసు నమోదు చేశారు. ఖైరతాబాద్ సర్కిల్ జూనియర్ ఎంక్వైరీ అధికారి సాయి కిరణ్ ఈ మేరకు బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి కల్యాణ్‌నగర్ డెక్కన్ ప్రైమ్ రెస్టారెంట్ సమీపంలో పీడీఎస్ గోధుమల అక్రమ రవాణాపై విశ్వసనీయ సమాచారం అందింది. అక్కడికి చేరిన పోలీసులకు అనుమాన్పదంగా తారసపడిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొన్నారు. విచారించగా సుచిత్ర ప్రాంతానికి చెందిన ఎం. లక్ష్మీకృష్ణారెడ్డి (48) గోధుమల కొనుగోలుదారుగా వ్యవహరిస్తున్నట్లు వెల్లడైంది. అలాగే రేషన్ షాప్ నెం. 716 యజమాని వి.బి.ఎల్. మూర్తి దుకాణంలో పని చేస్తున్న మొహమ్మద్ యాసీన్ ఈ అక్రమ కార్యకలాపాల్లో భాగస్వామిగా ఉన్నట్లు గుర్తించారు. వారి వద్ద నుంచి 50 కిలోల చొప్పున 37 గోనె సంచుల్లో ఉన్న మొత్తం 18.5 క్వింటాళ్ల పీడీఎస్ గోధుమలతోపాటు ఒక టాటా మెగా ఎక్స్ ఎల్ నాలుగు చక్రాల వాహనం స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సరుకుల మొత్తం విలువ సుమారు రూ.55,500గా అంచనా వేశారు. సంఘటనపై అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆందోళన

సైఫాబాద్, జనవరి 5 ప్రభాతవార్త: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దశలవారిగా ఆందోళన కార్యక్రమాలను చేపడుతున్నామని తెలంగాణ పొలిటికల్ జెఎసి హెచ్చరించింది. తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, 250 గజాల ఇండ్ల స్థలాన్ని కేటాయించాలని, పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూ ఈ నెల 29న ఇందిరాపార్కు ఎదుట మహాధర్నా చేపడుతున్నామని జెఎసి ఛైర్మన్ నరాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బత్తుల సోమయ్య, మహిళా విభాగం అధ్యక్షురాలు మంజుషా తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు మున్సిపల్, జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో కల్పించాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 5న ఇందిరాపార్కు వద్ద 'బిసిల మహా గర్జన' ఆందోళన కార్యక్రమాన్ని చేపడుతున్నామని హెచ్చరించారు. అలాగే గోదావరి జలాల విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు మోసాలను, మోసపూరిత విధానాలను ఎండగట్టడానికి ఫిబ్రవరి 15న లక్డికాపూల్‌లోని సెంట్రల్ కోర్టు హాల్‌లో ప్రజెంటేషన్

సమావేశంలో అభివాదం చేస్తున్న జెఎసి నాయకులు నరాల సత్యనారాయణ, సోమయ్య, మంజుషా తదితరులు

కార్యక్రమం జరుగుతుందని, రైతులకు రైతు బంధు 15 వేలు, రుణమాఫీ 2 లక్షలు, ఎరువుల కొరత నివారణ, నాణ్యమైన విత్తనాలు సరఫరా తదితర అంశాలపై ఫిబ్రవరి 25న ఇందిరా పార్కు ఎదుట మహాధర్నా, మహిళలకు నెలకు 2,500, తులం బంగారం అమలు చేయాలని మార్చి 3వ తేదీన మహిళలచే మహాధర్నా చేపట్టబోతున్నామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో జెఎసి నాయకులు జానికిరెడ్డి, సయ్యద్‌రఫీద్, పాలకుర్తి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న రెవెన్యూ సిబ్బందిని అభినందించిన తహశీల్దార్ ఖాన్

అడ్డగుట్ట,జనవరి 5 ప్రభాతవార్త: మారేడ్‌పల్లి తహశీల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్ స్వర్ణల త,టైపిస్ట్ సంధ్యలు పదోన్నతులపై బదిలీ అవుతున్న సందర్భంగా సోమవారం మారేడ్‌పల్లి తహశీల్దార్ మహ్మద్ అసదుల్లాఖాన్ శాలువకప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రాజు నాయక్, రెవెన్యూ సిబ్బంది మోహన్, సర్వేకొంగ్, క్రితీక, సమ్మయ్య, దండి రాజు, నరేశ్, సర్వేయర్ శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

సిఎండీ ముషారఫ్‌అలీని కలిసిన ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లు

హైదరాబాద్,జనవరి 5,ప్రభాతవార్త: తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు చెప్పడంతోపాటు కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలు,ఎల్‌సిలు,ఓసిల అంశాలపై చర్చించారు. అలాగే కమర్షియల్ డైరెక్టర్ చక్రపాణిని కలిసి శుభాకాంక్షలు తెలపడంతో పాటు వివిధ అంశాల పైన కాంట్రాక్టర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చలు జరిపినట్టు రాష్ట్ర అధ్యక్షుడు. జి సి రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆలూరు మహేందర్, చిన్న పుల్లారావు, సలహాదారు రాజు మహారాజ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కనకాచారి, మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు నవీన్ కుమార్, ఎం శ్రీనివాస్ రావు, శ్రీనివాసరావులతోపాటు ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డ్ మాజీ సభ్యులు నక్క యాదగిరి తదితరులు పాల్గొన్నారు

సిఎండీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జీసిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్,నక్కయాదగిరి తదితరులు

అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి
-పక్కాగా ఇంటింటి సర్వే చేయాలి
-డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి

అత్తాపూర్ జనవరి5,ప్రభాతవార్త : రాజేంద్రనగర్ సర్కిల్ బండ్లగూడ జగీర్ మునిసిపల్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులతో ఓటర్ జాబితా తయారీపై రాజేంద్ర నగర్ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి సమీక్షా సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ...బూత్ లెవెల్ అధికారులతో కలిసి ఓటర్ జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్త పని చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు,2002 జాబితాతో 2025 ఎన్నికల జాబితా మ్యాపింగ్ వర్గాల

ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి : కిషన్

తుర్కయంజాల్ జనవరి5, ప్రభాతవార్త

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఆటో డ్రైవర్లకు రూ.12,000/ లు ఇస్తామని, రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని వెంటనే నెరవేర్చాలని, ఆల్ లైన్ దోపిడీని అరికట్టాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు డి కిషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తుర్కయంజాల్ రాగన్నగూడ సర్కిల్లో ని సీఐటీయూ కార్యాలయంలో ఆటో డ్రైవర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు డి కిషన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో డ్రైవర్లకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో నిరక్ష్యం వహిస్తుందని అన్నారు. ఎన్నికల మెనిఫెస్టోలో ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12000/ లు ఇస్తానని వాగ్దానం చేసింది అదే విధంగా ఆటో మోటార్ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలల్లో కూడా అధిక ప్రాధాన్యత ఇస్తామని చెప్పి అమలు చేయడం లేదని అన్నారు. 2019 మోటార్ వెహికిల్ చట్టంలో ట్రాన్స్పోర్ట్ రంగ కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న విధానాలను వెంటనే కార్మికులకు అనుగుణంగా సవరించాలని డిమాండ్ చేశారు అనంతరం ఆటో డ్రైవర్లకు సిఐటియు యూనియన్ గుర్తింపు కార్డులను అందజేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు ఏర్పుల నరసింహా, ఆటో ట్రాలీ డ్రైవర్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ధర్మారెడ్డి, కోశాధికారి శేఖర్ రెడ్డి,డ్రైవర్స్ హనుమంత్ రెడ్డి, హరీష్, బీరప్ప,శ్రీనివాస్ రెడ్డి, చెన్నారెడ్డి, వినోద్, శిప్పాల్, యాదయ్య, వెంకట్ రెడ్డి, కృష్ణ, రామకృష్ణారెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు

హజ్ యాత్రికులకు మెరుగైన సౌకర్యాలను అందించాలి

ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ చైర్మన్ హాజీ షేక్ హసన్ బాషా తో భేటీ అయిన బిఆర్ఎస్ నాయకులు హయత్ హూస్సేన్ హబీబ్ తదితరులు

మలక్ పేట, జనవరి 5, ప్రభాతవార్త :

హజ్ యాత్రికులకు మెరుగైన సేవలను అందించాలని గ్రేటర్ హైదరాబాద్ కేసీఆర్ సేవాదళం ఉపాధ్యక్షుడు, చావుని డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు హయ్యత్ హుస్సేన్ హబీబ్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ చైర్మన్ హాజీ షేక్ హసన్ భాషాతో హయ్యత్ హుస్సేన్ హబీబ్ బేటి అయి పలు అంశాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా హయ్యత్ హుస్సేన్ హబీబ్ మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారికి అత్యుత్తమమైన సౌకర్యాలను అందించడం జరిగిందని వివరించారు. హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్తమమైన సేవలను అందించాలని కోరారు. మైనారిటీలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

సీనియర్ సిటిజన్స్‌కు గుర్తింపు కార్డుల పంపిణీ

సీనియర్ సిటిజన్స్‌కు గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.

వనస్థలిపురం. జనవరి.5ప్రభాతవార్త

బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ వైదేహినగర్ నార్త్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు వైదేహినగర్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో వైదేహి నగర్ నార్త్ నందు జరిగిన సీనియర్ సిటిజన్ గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమానికి అతిథిగాఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరైయ్యారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్ కార్డు అనేది 60 ఏళ్లు పైబడిన వారికి ప్రభుత్వ పథకాలు,ఆరోగ్య సంరక్షణ రాయితీలు,ప్రయాణ తగ్గింపులు (బస్సులు,రైళ్లు), బ్యాంకుల్లో నీదీలపై అధిక వడ్డీ,ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రాధాన్యత సేవలు వంటి అనేక ప్రయోజనాలను అందిస్తుంది.ఇది వయస్సు మరియు గుర్తింపుకు అధికారిక రుజువుగా పనిచేస్తుంది.ఆధార్ కార్డుకు ప్రత్యామ్నాయంగా కూడా ఉపయోగపడుతుంది అని అన్నారు.కార్యక్రమంలో బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి,వైదేహి నగర్ నార్త్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పోగుల రాంబాబు,కార్యదర్శి రాజేందర్ రెడ్డి,అసోసియేషన్ సభ్యులు జే.ఎల్.నారాయణ, నాగరాజు,శ్రీనివాస్, ఉపేందర్, రామనాథరెడ్డి,వెంకట నరసింహారెడ్డి,కృష్ణ,వేణుగోపాల్,ప్రభాకర్ రావు,మూర్తి,నరసింహం,కోటేశ్వరయ్య,చక్రధర్ రెడ్డి,వెంకటేష్ గౌడ్,సీతామెహర్ నాగ్ మరియు వైదేహి నగర్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ రామకృష్ణ,కార్యదర్శి పి. వెంకయ్య,ఉపాధ్యక్షులు ఏ.వేణుగోపాల్,కోశాధికారి ప్రకాష్ బాబు మరియు సభ్యులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి కృతజ్ఞతలు

మల్కాజిగిరి జనవరి 6 ప్రభాతవార్త;

గౌతమ్ నగర్ 141 డివిజన్ రెండుగా విడిపోయిన సందర్భంగా గౌతమ్ నగర్ డివిజన్ లో ఉన్న ఎనిమిది కాలనీలు మిర్జాలగూడ డివిజన్ లో కలిశాయి. గౌతమ్ నగర్ లో ఉన్న 8 కాలనీలో మీరు కలవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని ఉద్దేశంతో ఉత్తమ్ నగర్, దయానంద్, నగర్ గౌతమ్ నగర్, మల్లికార్జున నగర్, హనుమాన్, పేట్ జ్యోతి నగర్ కాలనీవాసులు గౌతమ్ నగర్ డివిజన్లోనే ఉండాలని ఎమ్మెల్యే ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు స్పందించిన ఎమ్మెల్యే మిర్జాల్‌గూడ డివిజన్లో కలిసిన 8 కాలనీలను తిరిగి గౌతంనగర్ డివిజన్లో కలిపే విధంగా కృషి చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి నివాసంలో 8 కాలనీలకు సంబంధించిన అధ్యక్ష కార్యదర్శులు వెళ్లి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కి స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి : షేక్ అక్బర్

మలక్ పేట, జనవరి 5, ప్రభాతవార్త:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారని మలక్ పేట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ షేక్ అక్బర్ పేర్కొన్నారు. షేక్ అక్బర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాలను అందజేసి శాలువాలతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా షేక్ అక్బర్ మాట్లాడుతూ...హైదరాబాద్‌కు మరో మణిహారంలా, ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తెలంగాణ కీర్తి ప్రతిష్ఠలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తూ, స్పష్టమైన విజన్, దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఫ్యూచర్ సిటీ హైదరాబాద్‌ను నిజమైన గ్లోబల్ మహా నగరంగా మార్చే దిశగా కీలకమైన అడుగుగా నిలుస్తుందని అన్నారు.సైబరాబాద్‌ను హైదరాబాద్‌కు మణిహారంలా తీర్చిదిద్దిన గత ముఖ్యమంత్రుల అభివృద్ధి పరంపరను కొనసాగిస్తూ, తనదైన శైలిలో పక్కా ప్రణాళికలు, స్పష్టమైన



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సన్మానించి అభినందనలు తెలియజేస్తున్న మలక్ పేట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ షేక్ అక్బర్ తదితరులు

లక్ష్యాలతో సీఎం రేవంత్ రెడ్డి అభివృద్ధి బాటలో ముందుకెళ్తున్నారని తెలిపారు. ఈ అభివృద్ధి దశ రియల్ ఎస్టేట్ రంగానికి కొత్త ఊపిరిని ఇవ్వడమే కాక, దేశ, విదేశీ పెట్టుబడిదారుల్లో అపూర్వమైన విశ్వాసాన్ని నింపుతోందని, రాబోయే రోజుల్లో హైదరాబాద్ పెట్టుబడులకు అత్యంత ఆకర్షణీయ గమ్యంగా మారబోతోందని ఆయన పేర్కొన్నారు.

పాల బిల్లులు చెల్లించని పక్షంలో చైర్మన్ రాజీనామా చేయాలి : మాజీ చైర్మన్ శ్రీకర్

హయత్ నగర్, జనవరి 5 ప్రభాతవార్త :

పాడి రైతుల పెండింగ్ పాల బిల్లులు వెంటనే చెల్లించాలని లేని పక్షంలో చైర్మన్ మధుసూదన్ రెడ్డి రాజీనామా చేయాలని నార్ముల్ మదర్ డెయిరీ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్ రెడ్డి, పాలక వర్గ సభ్యులు అలివేలు రంగారెడ్డి, కస్తూరి పాండు, సందిల భాస్కర్ గౌడ్ డిమాండ్ చేశారు. పాల బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ మద్దతుతో గెలుపొందిన ప్రస్తుత, మాజీ పాలకవర్గ సభ్యులు, పాడి రైతులు సోమవారం హయత్ నగర్ లోని మదర్ డెయిరీ గేటు ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పాడి రైతులకు పాల బిల్లులు చెల్లించడంలో చైర్మన్ విఫలమయ్యారని విమర్శించారు. గతంలో యాదగిరి గుట్ట, చెర్వుగట్టు, కీసర, వేములకొండ ఆలయాలకు మదర్ డెయిరీ నుంచి నెయ్యి సరఫరా ఉండేదని ప్రస్తుత చైర్మన్ అధికారంలోకి వచ్చాక నెయ్యి సరఫరా విజయ డెయిరీ చేస్తోందన్నారు. దీన్ని అడ్డుకోవడంలో చైర్మన్ విఫలమయ్యారని విమర్శించారు. చైర్మన్ ప్రమాణ స్వీకారం రోజున మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య లు ప్రభుత్వం నుండి ప్రత్యేక గ్రాంట్ తీసుకువచ్చి మదర్ డెయిరీ ని నష్టాల నుండి లాభాలలోకి తీసుకు వస్తామని చెప్పిన మాటలు నీటి మూటలుగా మిగిలాయాన్నారు. ఎన్

గేటు ముందు బైఠాయించిన మాజీ చైర్మన్, రైతులు

డీ బీ బీ తో ఒప్పందం పేరిట చైర్మన్ కాలయాపన చేస్తున్నారని వారు మండిపడ్డారు. 11 మంది డైరెక్టర్లు అవిశ్వాసం నోటీసు ఇచ్చినా చైర్మన్ సమావేశానికి ఎందుకు హాజరు కాలేదని వారు ప్రశ్నించారు. నోటీసు ఇచ్చిన పాలక వర్గ సభ్యులు సైతం హాజరు కాకపోవడం ఏమిటని అనుమ్మాన వ్యక్తం చేశారు. చైర్మన్ వెంటనే పాల బిల్లుల చెల్లింపుపై స్పష్టమైన హామీ ఇవ్వాలని లేని పక్షంలో రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం చైర్మన్ మధుసూదన్ రెడ్డి వారితో ఫోన్లో మాట్లాడి తనకు రెండు రోజులు సమయం ఇవ్వాలని కోరారు. కనీసం రెండు పాల బిల్లులను రైతులకు చెల్లిస్తామన్నారు. 8న పాలకకవర్గ సమావేశం ఏర్పాటు చేస్తామని తెలపడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో మాజీ డైరెక్టర్లు దొంతిరి సోమిరెడ్డి, కాయితి వెంకట్ రెడ్డి, ఒగ్గు బిక్షపతి పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి : చింతల రవికుమార్ గుప్తా

సైదాబాద్, జనవరి 5 ప్రభాతవార్త: ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ కమిటి ఛైర్మన్ చింతల రవికుమార్ గుప్తా అన్నారు. చంపాపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఇడుకుళ్ల విజయనాథ్ గుప్తా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చింతల రవికుమార్ మాట్లాడుతూ రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో ఆర్యవైశ్యులు పోటీ చేయాలని, వారికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. పార్టీలకు అతీతంగా ఆర్యవైశ్యులను గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. నూతన అధ్యక్షుడు విజయనాథ్ గుప్తా మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. జిల్లా అధ్యక్షుడు గందె సురేష్ గుప్తా, ప్రధాన కార్యదర్శి బిల్లకంటి కిరణ్ కుమార్ గుప్తా, కోశాధికారి బద్రి నాథ్ గుప్తా, ఆర్యవైశ్య మహాసభ రంగారెడ్డి జిల్లా వాసవి సేవాదళ్ అధ్యక్షుడు బచ్చు మహేష్ గుప్తాలు మాట్లాడుతూ జిల్లాలోని మండస్థాయి సంఘాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని, ఎన్నికల్లో పోటీ చేసి వారికి పూర్తి సహకారం

విజయనాథ్ గుప్తాను సన్మానిస్తున్న చింతల రవికుమార్

అందిస్తామని అన్నారు. చంపాపేట ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శిగా ఊరె మధుసూధన్‌గుప్తా, కోశాధికారిగా నరేష్, అన్న ప్రసాద వితరణ కమిటి ఛైర్మన్‌గా బచ్చు మహేష్ గుప్తాలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షులు అర్దం లక్ష్మయ్య గుప్తా, తాడేపల్లి వెంకటేషం గుప్తా, కొత్త రవి గుప్తా, కుంచారపు రాజు గుప్తా, నాళ్ల శ్రీనివాస్ గుప్తా, సాయిరాం గుప్తా, ఊరె రవీందర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు చేయూత

లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్ అందజేస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

ఉప్పల్, జనవరి 6 ప్రభాతవార్త : అర్హులైన పేదలకు సిఎం సహాయనిధి కింద తగు చేయూత అందిస్తున్నామని చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. సోమవారం చిలుకానగర్ డివిజన్ ప్రశాంతి నగర్ కాలనీకి చెందిన ఇందిర అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతుండడంతో కార్పొటర్ బన్నాల గీత బాధితురాలి ఇంటికి వెళ్లి సిఎం సహాయనిధి కింద రూ.48వేల చెక్ అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో అర్హులైన పేదలకు తగు చేయూత అందిస్తున్నామని తెలిపారు. బాధితులకు అధికంగా ఇచ్చే విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని తెలిపారు. బాధితురాలికి తగు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నేతలు ఎడ్లల కొండల రెడ్డి, ముద్ధం శ్రీనివాస్ యాదవ్, బీరప్ప గడ్డ బాలు, చిన్న ముదిరాజ్, సాయి గౌడ్ పాల్గొన్నారు

పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి : ఎండి రఫీక్

సమస్యలు తెలుసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎం.డి.రఫీక్ తదితరులు

రామంతాపూర్, జనవరి 6 ప్రభాతవార్త : పాత రామంతాపూర్‌లోని పలు ప్రాంతాల్లో సోమవారం కాంగ్రెస్ పార్టీ నేతలు విస్తృత్తంగా పర్యటించారు. కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు మహమ్మద్ రఫీక్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పలు ప్రాంతాల్లో పర్యటిస్తున్నామని ఆయన తెలిపారు. డివిజన్ పరిధిలోని ప్రతి ఒక్కరిని కలుసుకుని సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నామని ఎం.డి.రఫీక్ తెలిపారు. పాత రామంతాపూర్‌లో డ్రైనేజీ సమస్య,రోడ్లు లేక ఇబ్బంది పడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పలు సమస్యలను అధికారులకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రతినిధి మొహమ్మద్ తౌఫిక్, మల్లికార్జున దేవస్థానం మాజీ చైర్మన్ నామ్ రాజిరెడ్డి, పూస సత్తయ్య, మొగిలి లింగం, బెస్త భాస్కర్, అంగాల సందీప్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సంధ్యా రాణి, గాయత్రి,తబుసుమ్ బేగం, ముత్యాల రవి, సుమంత్, రాజ్ కుమార్, శివసదన్, రఘువీర్ రెడ్డి, బుగ్గ పరమేష్, చిన్న, మహ్మద్ నయీమ్, చోటు బాయ్, శివరాజ్, సాయి అరబింద్ యాదవ్,ఎండి షపీ,ఎండి సిద్దిక్, ఎండి రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాలాపూర్ మండలం జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని జిల్లెలగూడ న్యూవెంకటేశ్వర కాలనీలో మాజీ ఉప సర్పంచ్ మేకల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి రంగవల్లుల పోటీల సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరై మహిళలు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆటా) అధ్యక్షుడు చల్లా జయంత్‌రెడ్డి, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం మాజీ అధ్యక్షురాలు చల్లా కవితారెడ్డి

బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయకండి : బడంగ్‌పేట్ డిసి త్రిల్లేశ్వర్‌రావు

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న బడంగ్‌పేట్ సర్కిల్ డిసి త్రిల్లేశ్వర్‌రావు

సరూర్‌నగర్, జనవరి 5 ప్రభాతవార్త: జిహెచ్ఎంసి కిందకు వచ్చే బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలో ఏ డివిజన్‌లో కూడా బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయరాదని డిప్యూటీ కమీషనర్ త్రిల్లేశ్వర్‌రావు కోరారు. జిహెచ్ఎంసి కమీషనర్ ఆదేశాల మేరకు శంషాబాద్ జోనల్ కమీషనర్ చంద్రకళ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలో నిర్వహిస్తున్న స్పెషల్ సానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా సోమవారం డివిజన్లలోని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పారిశుధ్య పనులను నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్రంగూడ, అల్మాస్‌గూడ, నాదర్‌గుల్, ప్రశాంతిహిల్స్, మురళీకృష్ణాకళానగర్, టిఎస్ఆర్‌నగర్, జిల్లెలగూడ వైకుంఠధామం, దాసరి నారాయణరావు కాలనీ, గాయత్రీనగర్ కాలనీ, మీర్‌పేట్ ప్రగతినగర్, మారుతీనగర్, త్రివేణినగర్, బడంగ్‌పేట్ శివనారాయణపురం, షిర్డీ ఎన్‌క్లేవ్, బాలాపూర్ సబ్ స్టేషన్, మల్లాపూర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సానిటేషన్ సిబ్బంది చెత్తా చెదారాన్ని తొలగించి శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. ఈ పనులను డిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని అన్నారు. ఇళ్ళల్లోని చెత్తను బహిరంగ ప్రదేశాల్లో కాకుండా ఇళ్ళ వద్దకే వచ్చే స్వచ్ఛ ఆటో రిక్షాల సిబ్బందికి అందజేయాలని డిసి సూచించారు. ఈ కార్యక్రమంలో డిఇఇ అభినవ్‌కుమార్, ఎఇలు హరీష్, గంగా ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ వంకాయల యాదగిరి, జూనియర్ అసిస్టెంట్ ఎం.నర్సింహ, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ రాము, వార్డు ఆఫీసర్లు, జవాన్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జనప్రియహోమ్స్ కాలనీ క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న మాజీ కౌన్సిలర్ ఈశ్వరమ్మ యాదవ్.

మహేష్ కుమార్ గౌడ్‌ని కలిసిన వజ్రేశ్ యాదవ్

టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్

బోడుప్పల్, జనవరి 6 ప్రభాతవార్త;

నూతన సంవత్సరం సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేసిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ వారితో పాటు ఉప్పల్ నియోజకవర్గం ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి , కూకట్ పల్లి నియోజకవర్గం ఇంచార్జ్ బండి రమేష్ పాల్గొన్నారు.

సిఫిల్ కాలనీ బోర్డు ప్రారంభం

మల్కాజిగిరి జనవరి 6 ప్రభాతవార్త;

ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని సిఫిల్ కాలనీ నేమ్ బోర్డు కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ ప్రారంభించారు. అనంతరం కాలనీవాసులు సిఫిల్ కాని కనెక్టింగ్ రోడ్డు పనులు ఆగిపోయాని కార్పొరేటర్ దృష్టికి తీసుకురావడం జరిగింది వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఫిల్ కాలనీ కృష్ణ చంద్రకళ పెద్దిరాజు అరుణ్ కుమార్, శేషగిరి, ఓం రాజ్, చంద్రకాంత్ సుస్మిత, వెంకట్రామన్, శ్రీమన్నారాయణ వెంకటేశ్వరరావు హరి ప్రసాద్ సోమయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్యనారాయణ సంపత్ రావు తదితరులు పాల్గొన్నారు

పండుగలు సంస్కృతి సాంప్రదాయలకు ప్రతీకలు

ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి.

వనస్థలిపురం. జనవరి.5.ప్రభాతవార్త

బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని వీరాంజనేయ కాలనీలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నిర్వహించిన ముగ్గుల పోటీ కార్యక్రమంలో బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముగ్గుల పోటీలు కాలనీలో నిర్వహించడం సంతోషకరంగా ఉందని అన్నారు కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సత్యనారాయణ, ఉపాధ్యక్షులు రామయ్య, జాయింట్ సెక్రెటరీ రెహమాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఖాదర్ బాషా, ట్రెజరర్ శివ శంకరయ్య, కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ రెడ్డి, రమేష్, అనిల్ కుమార్, సాయి శ్రీ వాత్సవ్, ఫణీంద్ర మరియు నిర్వహణ జడ్జిలు శకుంతల, ప్రవీణ, విజయలక్ష్మి, విజేతలు వెంకట రాధా, మహేశ్వరి, పూజ మరియు తదితరులు ఉన్నారు.

గౌడ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

బోడుప్పల్, జనవరి 5 ప్రభాతవార్త ;

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ చెంగిచర్ల డిలిజన్ లో ఎస్ ఎన్ కన్వెన్షన్ హాల్ లో సర్దార్ పాపన్న గౌడ సంఘం క్యాలెండరు ఆవిష్కరణ జరిగింది . ముఖ్య అతిథులుగా బోడుప్పల్ డిప్యూటి మేయర్ కొత్త లక్ష్మీ రవి గౌడ్, మేడ్చల్ బి బ్లాక్ అధ్యక్షుడు కొత్త కిషోర్ గౌడ్, బీసీ కమీషన్ సభ్యులు బాల లక్ష్మి గౌడ్ , పాల్గొన్నారు బోడుప్పల్ మాజీ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవిగౌడ్ మాట్లాడుతూ... పార్టీలకతీతంగా గౌడ సంఘాలు సమిష్టిగా ఏకమైనప్పుడే మన పదవులు మనకు దక్కుతాయని, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తితో ప్రతి గౌడ బిడ్డ జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదిగి అన్ని రంగాలలో రాణించాలని అన్నారు .ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ సంఘం నాయకులుఅయి వెంకన్న గాడ్ , ఎలుకట్టే విజమ్ కుమార్ గౌడ్ ,వేములయ్య గౌడ్, డా . సింగా విజయ్ కుమార్ గౌడ్ , పంజాల శ్రవణ్ గౌడ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్ గౌడ్ , రాష్ట్ర యువజన నాయకులు కొత్త సుశాంత్ గౌడ్ , పల్సం సోమన్న గౌడ్, కొత్త సాయి తేజ గౌడ్ , గాజుల శ్రీనివాస్ గౌడ్ , వివిధ పార్టీల నాయకులు, చెంగిచెర్ల గౌడ సంఘం పెద్దలు, గౌడ